
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 4 ఫిబ్రవరి 2025

రథసప్తమి వేడుకల ఏర్పాట్లతో తిరుమల కొండ జగజ్జగేయమానంగా వెలిగిపోతోంది. విద్యుత్ దీపతోరణాలు, పూల అలకంకరణలు కనువిందుగా ఉన్నాయి. మంగళవారం ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఏడు వాహనాలపై శ్రీవారు ఊరేగనున్నారు. అందుకే ఒకరోజు బ్రహ్మోత్సవం, అర్ధబ్రహ్మోత్సవం అని ఈ వేడుకను పిలుస్తారు. ఈ రోజున మాడవీధుల్లో ఊరేగే స్వామిని దర్శించుకుంటే, బ్రహ్మోత్సవాల తొమ్మిదిరోజుల వాహనసేవలను తిలకించినంత భాగ్యం దక్కుతుందని భావించి లక్షల సంఖ్యలో భక్తులు రథసప్తమికి తిరుమలకు చేరుకుంటారు.

వైకుంఠ ఏకాదశి టోకెన్ల తొక్కిసలాట ఘటన నేపథ్యంలో తిరుమలలో పటిష్ట ఏర్పాట్లను టీటీడీ చేసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వాహనసేవలు ఇలా..

ఉదయం 5.30 - 8: సూర్యప్రభ వాహనం (6.44 గంటలకు సూర్యోదయం)
9 - 10: చిన్నశేష వాహనం
11 - 12: గరుడ వాహనం
మధ్యాహ్నం 1 - 2: హనుమంత వాహనం
2 - 3: చక్రస్నానం
4 - 5: కల్పవృక్ష వాహనం
6 - 7: సర్వభూపాల వాహనం
రాత్రి 8 - 9: చంద్రప్రభ వాహనం







నేడు సప్తవాహన సవారీ

- రథసప్తమికి ముస్తాబైన తిరుమల
- భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

- ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మాడవీధుల్లో తాత్కాలిక షెడ్లు నిర్మించారు.
- మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.
- గతేడాది రథసప్తమికి 650 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తే ఈసారి ఈ సంఖ్యను 1,300కి పెంచారు. మరో వెయ్యి మంది విజిలెన్స్ సిబ్బంది కూడా విధుల్లో ఉంటారు.
- మూడు వేల మంది శ్రీవారిసేవకులు కూడా ఉదయం నుంచి రాత్రి వరకు గ్యాలరీల్లో ఉండే భక్తులకు సేవలు అందిస్తారు.
- 500 మంది టీటీడీ అధికారులు, ఉద్యోగులు గ్యాలరీల వద్ద విధుల్లో ఉంటారు.
- తొమ్మిది టన్నుల పూలతో అలంకరణలు చేపట్టారు. శ్రీవారి ఆలయంలో 3 టన్నులు, వెలుపల 6 టన్నులు వినియోగించారు.
- 30 వేల కట్‌ఫ్లవర్స్‌లో ఆలయంలోని పలు ప్రదేశాలను సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. ఆలయం ముందున్న బయోమెట్రిక్ వద్ద 10 వేల కట్‌ఫ్లవర్స్‌తో దశావతారాల సెట్టింగ్ చేశారు.

నిండిన ఉత్తరమాడవీధి

సోమవారం సాయంత్రానికే ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం 4 గంటల నుంచే మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుంటున్నారు. సూర్యకిరణాలు స్వామిని తాకే దాకా శుక్రవారం వేకువజాము నుంచి సూర్యప్రభవాహనాన్ని వాయువ్య దిక్కులో ఉంచుతారు. దీంతో ఉత్తరమాడవీధుల్లోని గ్యాలరీలన్నీ సోమవారం రాత్రికే నిండిపోయాయి.

..ఈ దర్శనాలన్నీ రద్దు

రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీని సోమ, మంగళ, బుధవారాల్లో టీటీడీ రద్దు చేసింది. అలాగే మంగళవారం వీఐపీ బ్రేక్, ఆర్జితసేవలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర ప్రత్యేక దర్శనాలను రద్దు చేసినట్టు టీటీడీ స్పష్టం చేసింది. అలాగే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి రావాలని, లేనిపక్షంలో సర్వదర్శన క్యూలైన్ ద్వారానే స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది.


బందోబస్తుపై పోలీసులు, విజిలెన్సు అధికారులతో చర్చిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

3 లక్షల మంది రావొచ్చు

- భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం
- టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా మంగళవారం ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటలకు ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగే స్వామిని దర్శించుకునేందుకు రెండు నుంచి మూడు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని ఈవో శ్యామలరావు తెలిపారు. ఈసందర్భంగా చేసిన ఏర్పాట్లను అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇంచార్జ్ సీవీఎస్వో మణికంఠ, వివిధ విభాగాల అధికారులతో కలిసి ఈవో సోమవారం పరిశీలించారు. తిరుమలలో భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేశామంటూ, భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఈవో మీడియాకు తెలిపారు. గతేడాది కంటే రెండు రెట్లు అధికంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మెడికల్ సిబ్బందితో పాటు అంబులెన్స్‌లు కూడా సిద్ధం చేశామన్నారు. సీసీ కెమెరాల నిఘాతో కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. దీనికి తగినట్టు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. గ్యాలరీల్లో అన్నప్రసాదం పంపిణీ, తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్లు వంటి సౌకర్యాలను ఈవో, ఇతర అధికారులు తనిఖీ చేశారు. కొంతమంది భక్తులతో నేరుగా మాట్లాడారు.

అలిపిరి కాలినడక మార్గంలో తనిఖీలు

అలాగే ఈవో శ్యామలరావు అలిపిరి కాలినడకమార్గంలోని మోకాళ్లమిట్ట వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మరుగుదొడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలోనూ ఈవో తనిఖీలు చేశారు. అన్నప్రసాదాల నాణ్యతపై భక్తులతో నేరుగా మాట్లాడారు. తాను కూడా భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు.


ఎస్వీయూ ఏడీ భవనం ముందు మేయర్ శిరీష, వైసీపీ కార్పొరేటర్లు


ఎస్వీయూ మెయిన్ గేటు వద్ద వైసీపీ కార్పొరేటర్ల బస్సు వచ్చే సమయంలో రెండు వర్గాలు గుమికూడటంతో నెలకొన్న ఉద్రిక్తత

- కోరం లేకపోవడంతో అధికారుల నిర్ణయం
- ఎస్వీయూ వద్ద ఉద్రిక్తత
- మా కార్పొరేటర్లను కిడ్నాప్ చేశారంటూ వైసీపీ ఆందోళన
- అలాంటిదేమీ లేదంటూ సభ్యుల ప్రకటన

డిప్యూటీ మేయర్ ఎన్నిక

నేటికి వాయిదా


సెనేట్ హాలులోపల ఎన్నికల అధికారి శుభం బన్సల్, ఎమ్మెల్యే ఆరణి, కూటమి మద్దతుదారు కార్పొరేటర్లు

మమ్మల్ని ఎవరూ కిడ్నాప్ చేయలేదు

కూటమి నేతలు తమని కిడ్నాప్ చేశారని వస్తున్న వార్తల్లో నిజంలేదని, తామంతా సురక్షితంగా ఉన్నామని కార్పొరేటర్లు అమరనాథరెడ్డి, అనీష్ రాయల్, అనిల్, మోహన్ కృష్ణ యాదవ్ తెలిపారు. తమ కార్పొరేటర్లపై దాడి చేసి కిడ్నాప్ చేశారన్న వైసీపీ నేతల ఆరోపణలపై వీరు సెల్ఫీ వీడియోల ద్వారా స్పందించారు. ఎన్నికకు వెళుతున్న సమయంలో జరిగిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భయపడి తాము సురక్షితంగా ఉన్నామన్నారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అనేక నాటకీయ పరిణామాలకు తెరలేపిన తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక జరగాలి. అందుకు ఎస్వీయూ సెనేట్ హాలులో ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ, కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి, జేసీ శుభం బన్సల్ ప్రకటించారు. 47 మంది కార్పొరేటర్లు, 3 ఎక్స్‌అఫిషియో సభ్యులున్నారు. 22 మంది మాత్రమే ఎన్నికకు హాజరయ్యారు. 50 శాతం కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా అనివార్యమైంది.

హాలులో 22 మంది

ఎస్వీయూ సెనేట్ హాలులోకి సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వైసీపీ రెబల్ కార్పొరేటర్లతో పాటు కూటమి డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ, మరికొందరు వచ్చారు. అరగంట తర్వాత ఎక్స్‌అఫిషియో సభ్యుడు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రావడంతో మొత్తం 22 మంది సభ్యులు ఎన్నికకోసం వేచిచూశారు.

గేటు బయట టెన్షన్

భూమన కరుణాకర్‌రెడ్డి ఇంటి నుంచి 23 మంది వైసీపీ కార్పొరేటర్లతో బస్సు బయలుదేరగా.. ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కూడా వచ్చారు. ఎస్వీయూ మెయిన్ గేటు సమీపంలోకి వచ్చేసరికి అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల వాళ్లు పెద్దసంఖ్యలో మోహరించారు. ఇంతలో బస్సు డోరు అద్దాలు పగిలాయి. ఈ గొడవలో ఐదుగురు కార్పొరేటర్లు బస్సు దిగి వెళ్లిపోయారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.వైసీపీ కార్పొరేటర్లను ఎస్వీయూ మెయిన్ గేటునుంచి లోపలకు వెళ్లే ఏర్పాట్లు చేశారు. 17 మంది గేటు లోపలకు వెళ్లారు. మరో ఇద్దరు గైర్హాజరు కాగా, ఓ మహిళా కార్పొరేటర్ అస్వస్థతతో వెనుదిరిగారు.

భూమన ఫోనుతో యూటర్న్

మరికొద్ది క్షణాల్లో వైసీపీ కార్పొరేటర్లు సెనేట్ హాలుకు చేరుకోబోతుండగా ఎంపీ గురుమూర్తికి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఫోను చేశారు. ఆ వెంటనే వైసీపీ కార్పొరేటర్లతో కలిసి ఆయన వెనుదిరిగారు. ఓటింగుకు హాజరైతే సంఖ్యాబలం ప్రత్యర్థులకే ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమ కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళ్లారని ఆరోపిస్తూ ఎన్నికను బహిష్కరిస్తే కోరం లేక వాయిదా పడుతుందని భూమన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. దీంతో ఎంపీ, ఎమ్మెల్సీ, మేయర్ ఇతర కార్పొరేటర్లు వెనక్కి వచ్చి ఏడీ బిల్డింగ్ సర్కిల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై కూర్చున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 11 నుంచి 12 గంటల్లోపు ఎన్నిక జరగాలి. మరికొంత సమయం కావాలని డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ పలుసార్లు అభ్యర్థించారు. కోరం లేకపోతే నిబంధనల మేరకు గంట సమయం మాత్రమే ఉంటుందని, వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు.

తిరుపతి నగరంలో 144 సెక్షన్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు తిరుపతి నగరంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం తెలిపారు. అదనపు బలగాలతో బందోబస్తుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్వీయూ మెయిన్ గేటు వద్ద ఉద్రిక్తత

- పోలీసులపై ఎస్పీ ఆగ్రహం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో ఎస్వీయూ మెయిన్ గేటు వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఉదయం 9.30 గంటలకు వైసీపీ శ్రేణులు యూనివర్శిటీ ప్రధాన రోడ్డు వద్ద ఆందోళన చేపట్టడంతో పోలీసులు చెదరగొట్టారు. వర్సిటీ వద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు ఉన్నా వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. అదే సమయంలో కూటమి నాయకులు, కార్పొరేటర్లు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు బాలాజీ కాలనీ నుంచి వర్సిటీ ఫ్లై ఓవర్ వరకు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. అదే సమయంలో వైసీపీ కార్పొరేటర్ల బస్సు రావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులను సైతం లెక్క చేయకుండా వర్సిటీ వైపు చొచ్చుకుని రావడానికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న ఎస్పీ హర్షవర్ధన రాజు ఆందోళనకారులను చెదరగొట్టారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఇరువర్గాలను చెదరగొట్టాక బస్సును లోపలకు పంపుతున్న ఎస్పీ

వర్సిటీ రోడ్డుపైకి భారీ సంఖ్యలో ఆందోళనకారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు చొచ్చుకుని వస్తున్నా నియంత్రించకపోవడంపై తిరుపతి ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీలత, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ గిరిధర్, ప్రధాన గేటు వద్ద విధుల్లో వున్న ఇద్దరు పోలీసు అధికారులపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీలు చేయడానికి వచ్చారా? జాతరను చూడడానికి వచ్చారా అని అసహనం వ్యక్తంచేశారు. విధులు సక్రమంగా చేయకుంటే వెళ్లండంటూ ఆగ్రహించారు. పోలీసులు ఎంత కఠినంగా విధులు నిర్వహిస్తే అంత భయం ఉంటుందనే విషయాన్ని మరచిపోకూడదన్నారు.

బస్సు అద్దాల ధ్వంసంపై కేసు

ఎస్వీయూ వర్సిటీ వద్ద వైసీపీ కార్పొరేటర్లు వస్తున్న బస్సు డోరు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనలో నారాయణవనం ఎస్ఐ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు వర్సిటీ సీఐ రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్లకు కునుకేదీ?

డిప్యూటీ మేయర్ ఎన్నిక కార్పొరేటర్లకు కునుకులేకుండా చేస్తోంది. ముఖ్యంగా కొత్త మహిళా కార్పొరేటర్లు అసహనంగా నలిగిపోతున్నారు. క్యాంపు రాజకీయాల్లో భాగంగా పలు చోట్ల హోటళ్లలో బస చేస్తున్న చోట్లకు అటు కూటమి.. ఇటు వైసీపీ నేతలు పోటాపోటీగా చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ వారిని నిద్రలేపి చిన్నపిల్లలున్నా పట్టించుకోకుండా నానా యాగీ చేశారు. సోమవారం ఎన్నికకు ముగింపు కార్డు పడుతుందనుకునేలోపు మళ్లీ వాయిదాపడడంతో వీరంతా నోరెళ్లబెట్టారు. మళ్లీ ఎవరి దారిన వారు క్యాంపులకు పయనమయ్యారు.

కార్పొరేటర్లు వెళ్లే బస్సుకు భద్రత కల్పించండి

- తిరుపతి ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం, డీజీపీ, జిల్లా ఎస్పీని ఆదేశించాలని కోరుతూ వైసీపీ జనరల్ సెక్రటరీ లేళ్ల అప్పిరెడ్డి, 40వ వార్డు కార్పొరేటర్ టి.భాస్కర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. పిటిషన్‌ను లంచ్‌మోషన్‌గా స్వీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత.. ఎస్వీయూలోని సెనేట్ హాల్‌కు వెళ్లేందుకు కార్పొరేటర్లు వినియోగించే బస్సుకు పోలీసు భద్రత కల్పించాలని ఎస్పీని ఆదేశించారు. భద్రత కల్పించాలని కోరుతూ ఎస్పీకి సమర్పించే వినతిపై ఆ బస్సులో ప్రయాణించే కార్పొరేటర్ల సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... డిప్యూటీ మేయర్ ఎన్నికకు వెళ్లే సమయంలో వైసీపీకి చెందిన కార్పొరేటర్లపై అధికార పార్టీ నాయకులు దాడికి పాల్పడే ప్రమాదం ఉందన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేపటి నుంచి 147 కేంద్రాల్లో ఇంటర్ ప్రాక్టికల్స్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 147 కేంద్రాల్లో బుధవారం నుంచి 20వ తేదీ వరకు జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఉదయం 9 నుంచి 12 వరకు.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు.. రెండు విడతల్లో ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. జనరల్ 24,927మంది విద్యార్థులకు 124 పరీక్షాకేంద్రాలు.. ఒకేషనల్ 2,355 మందికి 23 కేంద్రాల్లో ఈ పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 8.45 గంటలకంతా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అనుమతించేది లేదన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో నరసింహులు, ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి, డీఈవో కేవీఎన్ కుమార్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రాణం మీదకొచ్చిన పట్టాలపై నడక

- రైలు రావడంతో నీళ్లలోకి దూకేసిన యువకులు
- ఒకరి మృతి


మృతి చెందిన యలరాజు

తడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సరదగా పట్టాలపై నడిచివెళ్తుండగా అకస్మాత్తుగా రైలు రావడంతో బిత్తరపోయిన ఇద్దరు యువకులు నీళ్లలోకి దూకగా.. ఒకరు మృతి చెందారు. ఈ ఘటన తడ మండలం అక్కంపేట రైల్వేస్టేషన్ వద్ద జరిగింది. అనంతపురానికి చెందిన భానుశంకర్, అదే జిల్లాలోని నందికొట్టుకూరుకు చెందిన వడ్డే యలరాజు(20) ప్రకాశం జిల్లా మార్కాపురంలో డిప్లొమా మూడో సంవత్సరం చదువుతున్నారు. ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా శ్రీసిటీ సెజ్‌లోని హెవెల్స్ పరిశ్రమలో 3 నెలల నుంచి శిక్షణ తీసుకుంటున్నారు. తడ మండలం అక్కంపేట వద్ద అద్దె ఇంట్లో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం రైలు పట్టాలపై నడిచివెళ్తూ పాములకాలువ బ్రిడ్జిపైకి చేరుకున్నారు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి చెన్నై వైపు వెళ్లే మెమో రైలు రావడంతో కంగారుపడ్డ ఇద్దరూ పట్టాలపై నుంచి కాలువలో దూకేశారు. వీరిలో భానుశంకర్ ఒడ్డుకు చేరుకున్నారు. నీట మునిగిన యలరాజును స్థానికులు బయటకు తీసుకొచ్చి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. రైల్వే జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక బాజాభజంత్రీల మోత

- మొదలైన ముహూర్తాలు
- బుక్ అయిన కల్యాణ మండపాలు
- ఎటుచూసినా పెళ్లిళ్ల సందడే

- 8లో



గౌడ సంఘ నేత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

పాకాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిగరపల్లెకు చెందిన ఈడిగ గౌడ సంఘం అధ్యక్షుడు వి.విజయ కుమార్ గౌడ్ (73) సోమవారం మృతి చెందారు. మృతదేహాన్ని ఈడిగ గౌడ సంఘం ప్రతినిధులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీనివాసులు, దొరరాజు, మోహన్, రెడ్డప్ప, వేణు, మంజు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పాకాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కే వడ్డేపల్లె పంచాయతీ పరిధిలోని దొనకొండ గంగమ్మ తల్లి ఆలయం వద్ద సోమవారం 36 అడుగుల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కెవడ్డేపల్లె బీసీ కాలనీకి చెందిన వెంకటేష్, చిన్నపాపమ్మలు రూ.4లక్షల వ్యయంతో తయారు చేయించిన ధ్వజస్తంభానికి తొలుత పూజలు చేశారు. అనంతరం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో కె.సావిత్రి ప్రభాకర్ నాయుడు, సుధాకర్ నాయుడు, సుబ్రమణ్యం నాయడు, జేజప్పనాయుడు, త్యాగరాజుల రెడ్డి, రామ్మూర్తి రెడ్డి, రాజారెడ్డి, సుబ్బారెడ్డి, మురళి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి కాంక్షిస్తూ ప్రయాగ్‌లో యాగం



చంద్రగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టి విజన్-2047 సాకారం కావాలని కోరుతూ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో కూచువారిపల్లెకు చెందిన గోవింద సేవా మండలి అధ్యక్షుడు శ్రీనివాసులుస్వామి ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. మౌనీ అమావాస్య సందర్భంగా గతనెల 28వ తేదీ అర్ధరాత్రి బద్రీనాథ్ మహంత్ సమక్షంలో లండన్‌కు చెందిన డాక్టర్ హరిప్రసాద్, కూచువారిపల్లెకు చెందిన డాక్టర్ మహేష్‌లు యాగం చేపట్టారు.

ఎన్‌ఏఆర్‌ఎల్‌లో స్వచ్ఛతా పక్షోత్సవాలు



బెలూన్ ఎగురవేసిన అమిత్ కుమార్ పాత్ర

పాకాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గాదంకిలోని జాతీయ వాయుమండలీయ పరిశోధన ప్రయోగశాల (ఎన్‌ఏఆర్‌ఎల్)లో సోమవారం స్వచ్ఛతా పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. సంస్థ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్ర ఆధ్వర్యంలో బ్రోచర్ విడుదల చేశారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి బెలూన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా పక్షోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 15వరకు వివిధ కార్యక్రమాలు చేపడతామన్నారు. పెయింటింగ్, వ్యాసరచన, ఎన్‌ఏఆర్‌ఎల్ ఉద్యోగులు, విద్యార్థుల మధ్య క్విజ్ పోటీలు నిర్వహంచనున్నామన్నారు.

గురుకుల పాఠశాలలో ఘనంగా సరస్వతిదేవి పూజ



తిరుపతి రూరల్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): జూపార్క్ రోడ్డులోని జ్యోతిరావుఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వసంతపంచమి సందర్భంగా సోమవారం సరస్వతిదేవిపూజని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి వేదపండితుడి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులను ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్ కె.రేష్మ, టీచర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



ప్రత్యేక అలంకారంలో రాజశ్యామలాదేవి

రామచంద్రాపురరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి అన్నారు. శక్తిపీఠంలో రాజశ్యామలా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా తిరుమంజనం నిర్వహించాక అమ్మవానికి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఊంజల్‌సేవ జరిగాయి. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి స్వామి పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలపై అదనపు ఈవో ఆరా



గ్యాలరీల్లోని భక్తులతో మాట్లాడుతున్న అదనపు ఈవో

తిరుమల, ఫి బ్రవరి3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా సోమవారం రాత్రి శ్రీవారి ఆలయ మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరిన భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆరా తీశారు. జేఈవో వీరబ్రహ్మంతో కలిసి భక్తులతో మాట్లాడారు. ఈసందర్భంగా పలువురు సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాలు, ఉప్మా, మంచినీరు వితరణను అధికారులు పరిశీలించారు.

శివరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



రేణిగుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదళ్లచెరువులో కొలువై ఉన్న ఓంకార జ్యోతిలింగేశ్వర ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ... ఉత్సవాలను రెండు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆలయ ధర్మకర్త కృష్ణయ్యస్వామి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారు ధ్వంసం

- డిప్యూటీ మేయర్ ఎన్నిక ఎఫెక్ట్



తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో ఓ కారు ధ్వంసమైంది. ఈ ఘటన రాయల్ నగర్‌లో సోమవారం రాత్రి 12 గంటల సమయంలో చోటుచేసుకుంది.వైసీపీ నుంచి కూటమి వైపు చేరిన ఓ కార్పొరేటర్ సతీమణిని కొందరు వైసీపీ నేతలు కారులో రాయల్ నగర్‌కు తీసుకొచ్చారు.వైసీపీకి చెందిన ఓ కార్పొరేటర్ బంధువు ఇంట్లో ఆమెను ఉంచారు. ఆమెతో మాట్లాడి ఆ కార్పొరేటర్‌ను వైసీపీవైపు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. దీనికోసం వైసీపీ యువ నాయకుడు ఆ ఇంటికి వెళ్లి ఆమెతో చర్చించినట్లు సమాచారం. ఆయన అనుచరులు కొందరు పక్కనే ఉన్న టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి ఇంటి వద్ద తచ్చాడుతూ ఉన్నారు. ఈయన ఇంటిపైకి దాడికి వచ్చారన్న అనుమానంతో కొందరు టీడీపీ వర్గీయులు వారిపై దాడి చేశారు. దీంతో వారు పరుగు తీశారు. ఆగ్రహంతో వైసీపీకి చెందిన కారును ధ్వంసం చేసినట్లు సమాచారం. ఈ సమాచారం తెలిసిన వెంటనే అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, యూనివర్సిటీ సీఐ రామయ్య, ఈస్ట్ సీఐ నరసింహారావుతో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. భూమన అభినయ్, ఎంపీ గురుమూర్తి అక్కడికి చేరుకుని కారును పరిశీలించారు. ఇదంతా కూటమి నేతల పనేనని ఆరోపించారు.

చంద్రగిరి

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ఓ వాహనం మీదకు దూసుకువచ్చి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి(45)పై తిరుపతి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం దూసుకెళ్ళింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ముఖం గుర్తు పట్టలేని విధంగా నుజ్జు నుజ్జయింది. మృతదేహాన్ని పోలీసులు తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



చంద్రగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లె సమీపంలో ఆదివారం రాత్రి స్వర్ణముఖినదిలో రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. స్వర్ణముఖినదిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో తహసీల్దార్ శివరామసుబ్బయ్య ఆదేశాలతో రెవెన్యూ, పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టుకున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేటి నుంచి వికలాంగ పింఛన్ల పరిశీలన

భాకరాపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వికలాంగ పింఛన్లను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. ప్రభుత్వం మూడు రకాల పింఛన్లను పంపిణీ చేస్తుండగా అందులో మొదట మంచానికే పరిమితమైన వారి పింఛన్లను గత నెలలో పరిశీలించారు. ప్రస్తుతం అంగవైకల్యం పింఛన్లు పొందుతున్న వారిని పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 4న దిగవూరు, జంగావాండ్లపల్లె, నెల్లుట్లవారిపల్లె, 5న తిప్పిరెడ్డిగారిపల్లె, చట్టేవారిపాళెం, 10న చిట్టేచర్ల, చట్టేవారిపాళెం, 11, 12 తేదీల్లో చిన్నగొట్టిగల్లు పంచాయతీలోని పింఛన్లను పరిశీలించనున్నారు. పింఛన్లు పొందుతున్న వారందరినీ చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలిస్తారని వివరించారు.

విరాళంగా ద్విచక్రవాహనం

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయానికి ఓ సంస్థ సోమవారం ద్విచక్ర వాహనాన్ని విరాళంగా అందజేసింది. రూ.1.20 లక్షల విలువైన హీరో డెస్టినీ బైక్‌ను ఆ సంస్థ ప్రతినిధి నవజ్యోత్ శంకర్ సోమవారం ఆలయం ఎదుల బైక్‌కు పూజలు నిర్వహించి తాళాలను డిప్యూటీఈవో లోకనాథానికి అందజేశారు.

మృత్యుంజయస్వామికి పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ఆగ మోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పూజలు చేపట్టారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



సంధ్య సౌందర్యం : అస్తమయం తర్వాత తిరుమల కనుమదారిలో కనిపించిన దృశ్యమిది

ఆక్రమణదారుల బరితెగింపు

- రాత్రికిరాత్రే నిర్మాణపనులు ప్రారంభం
- గతంలో అడ్డుకున్నా బేఖాతరు



రామానుజపల్లెలోని ప్రభుత్వ భూమిలో నిర్మాణం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): రామానుజపల్లెలో సర్వేనంబరు 121/5లోని విలువైన ప్రభుత్వ భూమిలో(బండిబాట) కొందరు అదును చేసి అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇదేస్థలంలో గతంలో నిర్మాణం చేపడుతున్నారన్న ఫిర్యాదుపై రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్ స్పందించారు. స్థానిక రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అయినా ఆక్రమణదారులు లెక్క చేయక గుట్టుచప్పుడు లేకుండా తాజాగా రాత్రికి రాత్రే గుంతలు తీశారు. కమ్మిలు కట్టి నిర్మాణ పనులు చేపడుతున్నారు. నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంటురాయి వంటి మెటీరియల్‌ను ఆస్థలంలో చేర్చారు. దీనిపై స్థానిక వీఆర్వో మురళిని అడుగగా.. నిర్మాణం చేపడుతున్నారని తెలుసుకుని సోమవారం ఉదయం వెళ్లి అడ్డుకున్నామన్నారు. రెవెన్యూ రికార్డులలో సర్వేనంబరు 121/5లో 1.29ఎకరాలు బండిబాటగా నమోదైఉందన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన స్థలమేదైనా ఉంటే సర్వేతో నిర్ధారించుకోవాలన్నారు. అప్పటివరకు ఈస్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించామన్నారు. ఇక్కడి ప్రభుత్వభూమి అన్యాక్రాంతం కాకుండా ప్రజాఅవసరాలకు వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు సప్తవాహనాలపై పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి దేవి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించడానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారు సప్తవాహనాలపై మాడవీధుల్లో ఊరేగనున్నారు. ఉదయం 7గంటలకు సూర్యప్రభ, 8.30 గంటలకు హంస, 10గంటలకు అశ్వ, 11.30 గరుడ, 1గంటకు చిన్నశేష, 6గంటలకు చంద్రప్రభ, రాత్రి 8.30గంటలకు గజవాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. మధ్యాహ్నం 3.30గంటలకు కేటీ మండపంలో ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం జరగనుంది. అలాగే సూర్యనారాయణస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 6గంటలకు స్వామివారికి అశ్వవాహనసేవ జరగనుంది. 6.30గంటల నుంచి సర్వ దర్శనం ప్రారంభం కానుంది.

టీటీడీ చీఫ్ ఇంజనీర్ నియామకానికి ప్రమోషన్ కమిటీ

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ ఇంజినీర్ నియామకం కోసం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవదాయ శాఖ నుంచి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి హోదాల్లో ఒకరు కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. రెవెన్యూ శాఖ నుంచి సభ్యునిగా ఉంటారు. సాధారణ పరిపాలన విభాగం నుంచి కార్యదర్శి, టీటీడీ ఈవోలు సభ్యులుగా వ్యవహరిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినయ్ చంద్ స్పష్టం చేశారు.


ఈయూ జిల్లా కమిటీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీ

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ సోమవారం ప్రజారవాణాధికారి జి.నరసింహులు సమక్షంలో బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షుడు జి.ఆర్.చంద్ర, కార్యదర్శి వి.మస్తాన్, ఉపాధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి కె.రఘు, ట్రెజరర్ ఎన్.ఎస్.మణ్యం, ప్రచార కార్యదర్శి జొన్న సతీష్‌నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.ఎస్.వర్మ, సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ సహజాద్, రాష్ట్ర నాయకులు ఆవుల ప్రభాకర్‌యాదవ్, మురగమ్మ, తాజా మాజీలు తాండాయం సత్యనారాయణ, గురునాథం పాల్గొన్నారు.

నిరుపయోగమైన ఆలయ సిబ్బంది నివాసాలు



పాకాల,ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి వల్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామి ఆలయ సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. 15యేళ్ల క్రితం నిర్మించిన గృహాలు నిరుపయోగంగా మారాయి. ఆలయం వెనుక రూ.15లక్షల వ్యయంతో 16 కుటుంబాలు నివాసముండేలా క్వార్టర్స్ నిర్మించారు. స్లాబు వేసి తలుపులు అమర్చలేదు. రోడ్డు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో సిబ్బంది ఈ ఇళ్లల్లో చేరలేదు. దీంతో ముళ్ల కంచెల మధ్య శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇండ్లు వృథా అయ్యాయి. వీటిని తొలగించి ఆలయానికి అనుబంధంగా టీటీడీ లేదా టూరిజం శాఖ భక్తులకు కాటేజీలు నిర్మిస్తే బాగుంటుందని స్థానికులు సూచిస్తున్నారు.

రాయితీ డ్రిప్ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బిందు, స్ప్రింక్లర్ల ద్వారా సాగు చేస్తే నీరు, విద్యుత్, ఎరువులు ఆదా అవుతాయని జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్ చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అత్యధిక రాయితీపై ప్రభుత్వం సమకూర్చే ఈ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని రైతులను కోరారు. ఐదెకరాల లోపు చిన్న, సన్నకారు రైతులకు రూ.2.18లక్షల వరకు రాయితీపై పొందవచ్చు. 5-10 ఎకరాల రైతులకు గరిష్టంగా రూ.3.46లక్షల వరకు రాయితీ లభిస్తుంది. ఏడేళ్ల క్రితం డ్రిప్, స్ప్రింకర్లు ఏర్పాటు చేసుకున్న రైతులు అర్హతను బట్టి మళ్లీ దరఖాస్తు చేయవచ్చు. ఆధార్‌కార్డు, తహసీల్దారు ధ్రువీకరించిన భూమి యజామన్య పత్రం లేదా 1బీ రికార్డులతో రైతు భరోసా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో పొలం విస్తీర్ణ వివరాలు ఆధారంగా సబ్సిడీని నిర్ణయిస్తారు. రైతు వాటా మొత్తాన్ని ప్రాజెక్టు డైరెక్టర్ లేదా జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, తిరుపతి పేరు మీద (ఖాతా నెంబరు 922010035414746), ఆక్సిస్‌బ్యాంకు, తిరుపతి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూటీఐబి0003195 ఖాతాకు నేరుగా గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా జమ చేయవచ్చు. ఇప్పటివరకు జిల్లాలో 3,750 ఎకరాలకు కలెక్టర్ అనుమతి మంజూరు చేశారు. 2,700 ఎకరాలకు డ్రిప్ పరికరాలను అందజేశారు.

పోలీస్ స్టేషన్లో అభినయ్ హల్‌చల్



తిరుపతి, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): అలిపిరి పోలీస్ స్టేషన్లో వైసీపీ తిరుపతి ఇంచార్జ్ అభినయ్ రెడ్డి అతని అనుచరులు సోమవారం ఉదయం హల్‌చల్ చేశారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో 41వ డివిజన్ కార్పొరేటర్ స్రవంతి సోదరుడు రాజేష్‌కు పోలీసులు 141 నోటీసులు ఇచ్చి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అది తెలుసుకున్న అభినయ్ అలిపిరి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని డోర్ తెరిచి రాజేష్‌ను బయటకు తీసుకొచ్చారు. ఈక్రమంలో పోలీసులతో వాగ్వివాదం చేశారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణలో భాగంగానే అతడికి నోటీసులిచ్చి తీసుకొచ్చినట్టు పోలీసులు చెప్పడంతో వెళ్లిపోయారు.

రౌడీయిజంతో గెలవాలనుకుంటున్నారు : భూమన



తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికను కూటమి ప్రభుత్వం రౌడీయిజంతో గెలవాలని చూస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. కూటమి గెలిచే పరిస్థితి లేదనే ఎన్నికలు వాయిదా వేశారన్నారు. సోమవారం ఆయన ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అభినయరెడ్డి, కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ కార్పొరేటర్లను బెదిరించి, భయపెట్టి లాక్కున్నారని విమర్శించారు. నలుగురిని కిడ్నాప్ చేశారని ఆరోపించారు. బస్సులో వెళుతున్న తమ కార్పొరేటర్లపై అన్నా రామచంద్ర యాదవ్ అనుచరులచే దాడి చేయించారని ఆరోపించారు. తమకు స్పష్టమైన మెజార్టీ ఉంది కాబట్టే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని, దీనిపై ఎలక్షన్ కమిషన్ స్పందించాలన్నారు.

మీరే దాడులు చేసి మాపై నిందలా?

- ఇక నీ మాటలను తిరుపతి ప్రజలు నమ్మరు
- కరుణాకర్ రెడ్డిపై ఎమ్మెల్యే ఆరణి విమర్శ
- గతంలో ఏం చేశావో గుర్తుపెట్టుకోవాలన్న సుగుణమ్మ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులే దౌర్జన్యం చేసి తమపైన, పోలీసుల మీద నిందలు వేయడం తగదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తిరుపతిలో సోమవారం సాయంత్రం టీడీపీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో ఎంపీ ఉప ఎన్నిక, మున్సిపల్.. టౌన్‌బ్యాంకు ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసన్నారు. వీరి అకృత్యాలకు ఐఏఎస్, పోలీస్, మున్సిపల్ అధికారులపై వేటు పడలేదా అని గుర్తుచేశారు. ప్రభుత్వ, ఇనాం భూముల్లో అక్రమ నిర్మాణాలను అధికారులు చట్టబద్ధంగా కూల్చారని స్పష్టంచేశారు. 'నీ నియంతృత్వ పోకడలు భరించలేకే నేతలు బయటకు వస్తున్నారు. మేయర్‌ను అగౌరపరిచింది నువ్వుకాదా? నీ కుమారుడిలా మదన్ దౌర్జన్యం చేయలేదు. నీ మాటలను, నాటకాలను తిరుపతి ప్రజలు ఎప్పటికీ నమ్మరు. ఇకపై ఏ ఎన్నికలోనూ దౌర్జన్యంతో గెలవాలనే ఆలోచన మానుకో' అని సూచించారు. '2019లో నేను గెలిచినా, అధికారంతో ప్రకటించుకున్నావు. అందుకే మంత్రి పదవి సుగుణమ్మకు ఇవ్వమంటావా? అని జగన్ ఎద్దేవా చేసిన విషయం మరిచిపోవాయా? ఎన్నికల సందర్భంగా వెంకటరమణపై రెండుసార్లు దౌర్జన్యానికి దిగిన విషయం గుర్తులేదా? తిరుపతి పవిత్రతను నీతో పాటు నీ కుమారుడు అభినయ్ రెడ్డి మంటగలిపింది నిజంకాదా? గత మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకుని 26డివిజన్లను ఏకగ్రీవం చేసుకోలేదా' అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. మీకు కౌన్సిల్లో బలం ఉంటే ఎందుకు ఓటింగ్‌కు రాలేదని భూమనను తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ ప్రశ్నించారు. 'మా కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ తరఫున పార్టీ అధ్యక్షుడిగా ఏ ఫామ్, బీ ఫామ్‌లను ఎన్నికల అధికారికి అందించా. నేను అధికారికంగా ఎన్నికల అధికారిని కలిస్తే నోట్లిచ్చినట్టు అబద్దాలు చెబుతావా' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. టీటీడీ టెండర్లలో వందల కోట్లు దోచుకున్న నీకు పవిత్రత గురించి మాట్లాడే అర్హత లేదని భూమనపై జనసేన నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆరోపించారు. నీ చరిత్రను ఎన్డీఏ ప్రభుత్వం త్వరలో బయటపెడుతుందని, పవన్ గురించి మాట్లాడితే ఆకాశం మీద ఉమ్మడం లాంటిదని అన్నారు. 'మా ఇద్దరినీ రోడ్డున పడేశారు. మా వ్యక్తిగత జీవితంతో పనేముంది? రోడ్లు వేశామని చెప్పుకునే మీరు నిర్వాసితులకు రూపాయి ఇచ్చారా? జెరాక్స్ షాపులో పనిచేసే మీకు రూ.వేలకోట్లు ఎక్కడ నుంచి వచ్చాయి. రౌడీలు, గూండాలు అని మాట్లాడే అర్హత మీకు లేదు. తప్పుడు మాటలు, పిచ్చి కూతలు కూయకండి' అంటూ కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత తీవ్రంగా స్పందించారు.

డిప్యూటీ మేయర్ కోసం డ్రామాలు: జనసేన



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ పదవి కోసం భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబం డ్రామాలాడుతోందని జనసేన నేత కిరణ్‌రాయల్ ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు గంజాయి తాగి ఒకరినొకరు కొట్టుకున్నారని, కుమారుడి కోసం కరుణాకర్‌రెడ్డి నోటికొచ్చిన అబద్ధాలు చెబుతూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆయన అనుచరుల దాడులను తట్టుకోలేక కార్పొరేటర్లే భయపడిపోయారన్నారు. దొంగ ఓట్లకు బ్రాండ్ అంబాసిడర్ వైసీపీ నేతలని, అభినయ్‌రెడ్డి వెంట ఉన్నవారందరూ 420లేనని, పదుల సంఖ్యలో వారిపై కేసులున్నాయని గుర్తు చేశారు. ఓ మహిళా ఎస్సైపై దాడిచేసి బూతులు తిట్టారన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్‌ను జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనతను తగ్గించవచ్చన్నారు. 1-19 సంవత్సరాల పిల్లలందరికీ నులి పురుగుల నిర్మూలన మాత్రలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్, వైద్య, ఆరోగ్య శాఖాధికారులు హరిత, పద్మావతి, అభిజ్ఞ, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట అభివృద్ధికి తోడ్పడండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలెక్టర్ వెంకటేశ్వ ర్‌ను కోరారు. ఆమె సోమవారం కలెక్టర్‌ను కలిసి నియోజకర్గంలో సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు.

'తల'ను విజయవంతం చేయండి


యువతీ యువకులతో రాగినీరాజ్ సెల్ఫీ

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు రాగినీరాజ్ నటించిన తొలి చిత్రం 'తల'ను ఈ నెల 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేస్తున్నామని, విజయవంతం చేయాలని కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ కోరారు. కరకంబాడీ రోడ్డులోని శ్రీరామా ఇంజనీరింగ్ కాలేజీలో ఆ చిత్ర బృందం సోమవారం సినిమా ప్రమోషన్స్, ట్రైలర్‌ను విడుదల చేసింది. హీరో రాగినీరాజ్ యువతీ యువకులతో స్టెప్పులు వేస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత సినిమా ప్రమోషన్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. రాగినీరాజ్ మాట్లాడుతూ కుటుంబ కథా చిత్రమని, విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ పోటీలకు ఎంపిక


రమ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అసుంత

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గతనెల 28నుంచి 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని రమ్య విశేష ప్రతిభ కనబరిచింది. టేబుల్ టెన్నిస్‌లో, ఖోఖో, 400 మీటర్ల పరుగు పందెంలో రన్నరప్‌గా నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. టీటీడీ విద్యాశాఖాధికారి విజయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అసుంత ఆమెను అభినందించారు.

చైల్డ్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయండి


డీపీటీవోకు వినతిపత్రం అందజేస్తున్న వసంతబాయి

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండులో చైల్డ్ హెల్ప్ డెస్క్ ఏర్పాటుకు సహకరించాలని శిశుసంక్షేమాధికారిణి ఎస్.వసంతబాయి జిల్లా ప్రజారవాణాధికారి జి.నరసింహులను కోరారు. సోమవారం ఆమె డీపీటీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి శివకుమార్, కౌన్సిలర్ కల్పన, బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

లక్ష్యం, కృషితోనే ఉన్నత కెరీర్

● ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ డిప్యూటీ చీఫ్ శ్రీనివాసులు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసులు, గౌరీశంకర్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొదటి సంవత్సరంలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించుకునేందుకు కృషి చేయాలని, అప్పుడే కెరీర్ ఉన్నతంగా ఉంటుందని ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ బ్యూరో డిప్యూటీ చీఫ్ టి.శ్రీనివాసులు చెప్పారు. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ బయో మెడికల్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు అభ్యసించబోతున్న విద్య, అందుకు తగిన వృత్తిపరమైన అవకాశాలపై ముందుగానే అవగాహన పెంచుకోవాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంప్లాయిబులిటీ స్కిల్స్, టీం బిల్డింగ్ స్కిల్స్ మీద పట్టు సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, నేహా ఎంప్లాయిమెంట్ ఆఫీస్ అసిస్టెంట్, ఇంగ్లిష్ లెక్చరర్ డాక్టర్ పి.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకారవేతనమివ్వాలి


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ యూజీ, పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకారవేతనం అందించాలని కోరుతూ తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు సోమవారం నిరసన దీక్షకు దిగారు. వర్సిటీ ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించారు. అంతకుముందు తరగతులను బహిష్కరించి ప్లకార్డులను చేతబట్టి వర్సిటీలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు మాట్లాడుతూ 12 ఏళ్లుగా చాలీచాలని స్టైఫండ్‌ని అందిస్తున్నారని, రోజువారీ ఖర్చులకు కూడా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మెడికల్ విద్యార్థులకు నెలకు రూ.24వేలు అందిస్తూ వారితో సమానమైన తమకు మాత్రం కేవలం రూ.7వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఉపకారవేతనం పెంచేలా జీవో విడుదల చేసేవరకు తరగతుల బహిష్కరణ కొనసాగిస్తామన్నారు.

అ'పూర్వ' కలయిక



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం ముల్‌బాగల్‌లోని రామప్రియ టీచర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో 1989-90బ్యాచ్‌లో రెండేళ్ల టీచర్ ట్రైనింగ్ కోర్సు చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం న్యూబాలాజీ కాలనీలోని ఎంఎంటీజీ స్కూల్ ఆడిటోరియంలో నిర్వహించారు. పట్నాలువీధి నగరపాలక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భీమినేని మునికృష్ణనాయుడు నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో పూర్వ విద్యార్థులు హాజరై ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాల అప్పటి ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి మాట్లాడుతూ 36వసంతాలు గడిచినా గురువులను గుర్తుపెట్టుకుని ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థి, ప్రస్తుత హెచ్‌ఎం మునికృష్ణనాయుడు, రామప్రియ సంస్థ అధ్యాపకులు చెంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్తాజ్, రాజశేఖర్, రమణారెడ్డి, పూర్వ విద్యార్థులు అంజనీకుమార్, మేరీ, నాగరాజు, రెడ్డిశేఖర్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


నేడు ఎస్వీయూకు మధ్యాహ్నం వరకూ సెలవు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం వరకూ ఎస్వీ యూనివర్సిటీకి సెలవు ప్రకటించారు. సోమవారం ఉదయం డిప్యూటీ మేయర్ ఎన్నికకు యూనివర్సిటీ సెనేట్ హాల్ వేదికైంది. అయితే కోరం లేక మంగళవారానికి వాయిదా పడింది. అయినా సోమవారం వర్సిటీ పరిపాలనా భవనంలోని ఉద్యోగులకు సెలవు ప్రకటించారు. మంగళవారం మధ్యాహ్నం వరకూ యూనివర్సిటీ అంతటా సెలవు ప్రకటించారు. మధ్యాహ్నం నుంచి అన్ని కాలేజీలు, ఆఫీసులు యధావిధిగా కొనసాగుతాయని ఉన్నతాధికారులు తెలిపారు.

పుస్తక బ్రహ్మోత్సవాలు..!


17వ పుస్తక ప్రదర్శనకు పెరుగుతున్న సందర్శకుల తాకిడి - అలరిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రసంగాలు





తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో చేపట్టిన 17వ పుస్తక ప్రదర్శన పుస్తక బ్రహ్మోత్సవాలను తలపిస్తోంది. ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని వినాయక నగర్ గ్రౌండ్స్ వేదికగా నాలుగు రోజులుగా ఈ ప్రదర్శన కొనసాగుతోంది. సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ సాగుతున్న ఈ ప్రదర్శనకు సందర్శకుల నుంచి విశేష స్పందన వస్తోంది. ప్రాంగణంలో సాయంత్రం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. సాహిత్య ప్రసంగాల్లోని అంశాలు సందర్శకులను ఆలోచింపజేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణరాజు, సెక్రటరీ ఆచార్య దక్షిణామూర్తి శర్మ, స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

నిశ్శబ్ద చప్పుడు పుస్తకావిష్కరణ



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎస్వీయూ ఇంగ్లిషు విభాగ రిటైర్డు ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర రాసిన నిశ్శబ్ద చప్పుడు పుస్తకావిష్కరణ కార్యక్రమం తిరుపతి పుస్తక ప్రదర్శన వేదికపై సోమవారం నిర్వహించారు. నాయుని సుధాకర్‌మూర్తి ఆవిష్కరించారు. అడివిరేత్రి పుస్తకాన్ని ఎస్వీయూ లైబ్రరి రిటైర్డ్ ఉద్యోగి వి.షణ్ముగం ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను ఆకాశవాణి మాజీ డైరెక్టర్ మల్లేశ్వరరావు, ఎస్వీయూ ఓఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు పరిచయం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి సమాజ పోకడలను చాలా సజీవంగా ఈ పుస్తకంలో రచయిత చిత్రించారని తెలిపారు. రచయిత నరేంద్ర మాట్లాడుతూ పుస్తక పఠనం మన నాగరికతను సూచిస్తుందన్నారు. డిటెక్టివ్ కథల పుస్తకం గురించి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ప్రసాద్ సభికులకు పరిచయం చేశారు. భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు అధ్యక్షతన ఈ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గాత్ర, సంగీత ప్రదర్శన అలరించింది.

పుస్తక ప్రదర్శనలో నేడు

4వ తేదీన మంగళవారం సాయంత్రం 6 గంటలకు సాహిత్య వేదిక పేరుతో చేపట్టే సభలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్ కె.మధు జ్యోతి పాల్గొంటారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

మంచి నవలల కోసం వెతుకుతున్నా..



చండీదాస్ నవలలు హిమజ్వాల, అనుక్షణికం, బుచ్చిబాబు నవల 'చివరకు మిగిలేది, త్రిపురనేని గోపీచంద్ రాసిన 'అసమర్థుని జీవయాత్ర' నవలలు చదువుకున్నాను. అయితే మారిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విషయాలను ప్రతిబింబించే కొత్త నవలల కోసం వెతుకుతున్నాను. అనేక నవలలు చూశాను. అవసరమైనవి కొనాలని అనుకుంటున్నాను.

- తోట వేంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టీటీడీ

ఫిలాసఫీ పుస్తకాలు కొంటున్నా..



ప్రపంచంలో అనేక తత్వాలు ఉన్నాయి. ఇందులో మనిషినీ సమాజాన్నీ ప్రభావితం చేసినవీ, నడిపించేవీ, మార్చేవీ అనేకం ఉన్నాయి. ఇలాంటి పుస్తకాలను ఈ పుస్తక ప్రదర్శనలో జాగ్రత్తగా పరిశీలిస్తున్నాను. నేరుగా ఫిలాసఫీనే కాకుండా, కొందరు రచయితలు రాసిన రచనల్లోనూ తాత్విక భావాలను తెలియచేస్తూ ఉంటారు. ఇటువంటి ఫిలాసఫీ పుస్తకాలను పరిశీలించి కొనడానికి తిరుపతి పుస్తక ప్రదర్శనకు వచ్చాను. మంచి పుస్తకాలు ఇందులో ప్రదర్శనకు ఉంచారు.

- దయాకర్, అధ్యాపకులు, ఎస్వీయూ

కథల పుస్తకాల కోసం చూస్తున్నా..



ఈ బుక్ ఫెయిర్‌లో చాలా పుస్తకాలు కనిపిస్తున్నాయి. ఇన్ని పుస్తకాల్లో ఏది కొనాలో ఆలోచిస్తున్నాను. కథలు చదివే అలవాటు చాలా కాలం నుంచీ ఉంది. పత్రికల్లోనూ, టీవీల్లో వచ్చిన కథలను కూడా చూస్తుంటాను. పుస్తక ప్రదర్శనలో అనేక కథల పుస్తకాలు ఉన్నాయి. సోషియల్ కన్సర్న్ ఉన్న రైటర్స్ రాసిన కథల పుస్తకాలు కూడా ఉన్నట్టు అనిపిస్తుంది. అయితే, నాకు సస్పెన్స్ కథలంటే చాలా ఇష్టం. ఇలాంటి పుస్తకాలు కొనాలని చూస్తున్నాను.


- దివిజ, బీటెక్ విద్యార్థిని

పుస్తక ప్రపంచం - తిరుపతి రచయితల సంఘం స్టాల్



తిరుపతి పుస్తక ప్రదర్శనలో స్టాల్ నెంబరు-56లో తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రత్యేక స్టాల్ నిర్వహిస్తోంది. ఈ సంఘం ఇటీవలే తొలి వార్షికోత్సవం నిర్వహించుకుంది. ఏడాది క్రితం ఏర్పడిన ఈ సంఘానికి వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులుగా సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్ వ్యవహరిస్తున్నారు. తిరుపతి జిల్లాకు చెందిన రచయితల కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు, ఆత్మకథలు, జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు, యాత్రా చరిత్రలు వంటి పుస్తకాలు ప్రదర్శిస్తోంది. సగం ధరకే పుస్తకాలు పేరుతో తిరుపతిలో సెలవు రోజుల్లో పుస్తక ప్రదర్శనలను నిర్వహిస్తున్నారు. ఈ స్టాల్‌లో నామిని సుబ్రమణ్యం నాయుడు, మధురాంతకం నరేంద్ర, రాసాని, మౌని, జిల్లేళ్ల బాలాజీ, కృష్ణస్వామి రాజు, గల్లా అరుణకుమారి, మూరిశెట్టి గోవిందు తదితర రచయితల రచనలు ప్రదర్శనలో ఉంచారు.

మన పుస్తకం - గుప్పెడు మల్లెలు



ఈ కథా సంపుటాన్ని తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత జిల్లేళ్ల బాలాజీ రాశారు. 132 పేజీలు గల ఈ పుస్తకం ధర రూ.150. తిరుపతి రచయితల సంఘం స్టాల్- 56లో ఈ పుస్తకం లభిస్తుంది. పదిహేను చిన్న కథలు, తొమ్మిది పెద్ద కథలు, ఓ హాస్య నాటిక పొందుపరిచిన సంపుటిది. ఓ కవి జయంతి సభలో ఆ కవిని ఓ మంత్రి కీర్తిస్తూ ఉంటాడు, అదే సభలో ఆ కవి కుమారుడు జోలెపట్టి భిక్షాటన చేస్తూ ఉంటాడు. ఈ విషయాలు ఈ పుస్తకంలోని యాచకుడి కథలో కన్పిస్తాయి. ఓ పేద విద్యార్థి రోడ్డుపై విద్యుత్ వెలుగులో చదువుకొని పదో తరగతి డిస్టింక్షన్‌లో పాస్ కావాలనే కలను సాకారం చేసుకుంటాడు. వ్యంగ్యంతో కూడిన కథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. పాఠకుడిలో మంచి ఆలోచనలు కలిగించే విధంగా ఈ కథలు ఉండటం ప్రత్యేకత. ఈ కథల్లోని పరిమళాన్ని ఆస్వాదించాలంటే జిల్లేళ్ల బాలాజీ రాసిన గుప్పెడు మల్లెలు కథల పుస్తకం చదవాల్సిందే.

నేనేం చదువుతున్నానంటే..?

డాక్టర్ వీఆర్ రాసాని, రచయిత



ఒక రచన చేసే ముందు అందులోని ఇతివృత్తంతో ముడిపడిన అనేక విషయాలు క్షుణ్ణంగా తెలుసుకునేందుకు అనేక పుస్తకాలను చదివే అలవాటు ఉంది. ఇలా ఇటీవల కన్నడలో గీత నాగభూషణ రాసిన బతుకు నవలను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. ఈ నవలను శూద్ర స్త్రీ వ్యథను కళ్ల ముందర పరచిన నవల ఇది. అలాగే, మారుతీ పౌరోహిత్యం రాసిన చారిత్రక నవల 'ప్రణయ హంపీ, బండి నారాయణస్వామి రాసిన శప్త భూమి' నవల ఇష్టంగా చదువుతున్నాను. సూఫీ ఆదర్శవాదుల గురించి శాంతి నారాయణరాసిన ముడి, సాధన వంటి నవలలు బాగా ఆకట్టుకున్నాయి. తెలుగులోకి అనువాదమైన రచనలను కూడా బాగా చదువుతున్నాను. రాయలసీమ ప్రాంతీయ నేపథ్యం గల రచనలంటే కూడా బాగా ఇష్టం. ఝాన్సీ కొప్పిశెట్టి రచన అనాచ్ఛాదిత కథ, శివరాత్రి సుధాకర్, స్వాతి సంపాదకత్వంలో వచ్చిన 'ఎరుక' కథల సంకలనం చదివాను. టేకుమళ్ల వెంకటప్పయ్య 'స్వర్గాద పీగరీయసీ, జక్కుల రామకృష్ణ రాసిన 'జ్ఞాన జ్యోతులు', అద్దేపల్లె భరత్ కుమార్ రాసిన 'ఆలీతో సరదాగా', సుసర్ల సర్వేశ్వరశాస్త్రి నాటకాలు ఆసక్తిగా చదువుతున్నాను.

6న ఐటీఐలో జాబ్‌మేళా

తిరుపతి (ఆటోనగర్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పద్మావతీపురంలోని ఐటీఐలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన హాజరుకావాలని కోరారు. ఇండో ఎంఐఎం, అపోలో ఫార్మసీ, శ్రీరామ్‌ఫార్చ్యూన్స్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, బయోడేటా ఫామ్ తీసుకురావాలని కోరారు. దరఖాస్తుకు ప్రత్యేక లింక్ ఏర్పాటు చేశామని, వివరాలకు 9030527160కు సంప్రదించాలన్నారు.

చిరుతల కట్టడికి శాశ్వత చర్యలు చేపట్టరా?

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతిలో చిరుతల తాకిడి ఎక్కువైంది. అటవీ ప్రాంతానికి సమీపంలో గల యూనివర్సిటీల్లో చిరుత సంచారం ఎక్కువగా ఉంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, సందర్శకులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అలిపిరి నుంచి అగ్రికల్చర్ కాలేజీ వరకూ అటవీ ప్రాంతానికి ఆనుకుని కాలేజీలు, యూనివర్సిటీలు ఉన్నాయి. వేద విశ్వవిద్యాలయం, ఎస్వీ యూనివర్సిటీ, వెటర్నరీ యూనివర్సిటీ, అగ్రికల్చర్ కాలేజీ తదితర ప్రాంతాల్లో చిరుతల సంచారానికి తావు లేకుండా శాశ్వత చర్యలు చేపట్టాలనే అభిప్రాయం ఆయా యూనివర్సిటీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. అటవీ ప్రాంతం నుంచియూనివర్సిటీలను వేరుచేసేలా పదిఅడుగుల ఎత్తు ఇనుప కంచె ఏర్పాటుచేయడం ద్వారా చిరుతల సంచారాన్ని కట్టడి చేయొచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. ఆ దిశగా ఇటు ఆయా యూనివర్సిటీ అధికారులు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏప్రిల్ 5న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూళ్లలో 2025-26 సంవత్సరానికిగాను 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 5వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగనుందని పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 8688888802/ 9399976999లలో సంప్రదించాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులతో సూర్యనారాయణరెడ్డి, ఉప విద్యాశాఖాధికారి బాలాజీ


తిరుపతి(విద్య), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మబ్బు సూర్యనారాయణరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బైరాగి పట్టడలోని మహాత్మాగాంధీ నగరపాలక (ఎంజీఎం) ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం ఎం.మునిశారద ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దాత బ్లిస్, తాజ్ హోటళ్ల అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి ఎంఈఓ భాస్కర్‌నాయక్‌తో కలిసి 108 మంది విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల డైరెక్టర్ కె. విశ్వనాథరెడ్డి, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు బండి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురుగన్, భాస్కర్, హేమాద్రిబాబు, ఉషారాణి పాల్గొన్నారు.

రుయాలో సెక్యూరిటీ గార్డుపై దాడి కేసు విచారణ


తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో రోగులకు ఇబ్బంది లేకుండా వాహనం పక్కన పెట్టమని చెప్పినందుకు లోకనాథం అనే వ్యక్తి శనివారం సెక్యూరిటీ గార్డు కిరణ్‌పై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై రుయా సూపరింటెండెంట్ రవిప్రభు సోమవారం విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డుపై భౌతిక దాడి జరగలేదని, కేవలం ఇరువురి మధ్య వాగ్వాదం మాత్రమే చోటుచేసుకుందని చెప్పారు. దాడికి పాల్పడిన వ్యక్తికి, హెచ్‌డీఎస్ సభ్యులకు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. రోగులు చికిత్స పొందే ఆస్పత్రి ఆవరణలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని చెప్పారు.

పట్టించుకోండి సారూ!

వర్షాలకు బురద...ఎండకు దుమ్ము..


వర్షాకాలంలో బురదతో ఇలా..

టీటీడీ నిర్మిస్తున్న మంగళం ఆర్టీవో-శెట్టిపల్లి రోడ్డులో ప్రజలకు కష్టాలు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ముతో అల్లాడిపోతున్నారు. ఆ రోడ్డు పనులు ప్రస్తుతం 20శాతం మాత్రమే పూర్తయ్యాయి. గత డిసెంబరు వరకు కురిసిన వర్షాలకు రోడ్డు బురదతో కూరుకుపోయింది. వాహనచోదకులు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. ఇక సంక్రాంతి తర్వాత నుంచి ఎండ తీవ్రత పెరగడం, రోడ్డు పొడిబారడంతో వాహనాల తాకిడికి దుమ్మురేగిపోతోంది. టీటీడీ స్పందించి వెంటనే రోడ్డు పనులు పూర్తిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.


ఎండలు మొదలవడంతో దుమ్ముతో ఇలా..

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)

23న ప్రజారోగ్యం-సామాజిక బాధ్యతపై సదస్సు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ మెడికల్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యం-సామాజిక బాధ్యత అనే అంశంపై ఈనెల 23న సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రజారోగ్య వేదిక కన్వీనర్ కామేశ్వరరావు వెల్లడించారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన ఆరోగ్యాభిలాషుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారోగ్యం కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతరం మీద ఉందన్నారు. సదస్సులో ఎం.నాగార్జున, కేఆర్ఎస్ మణ్యం, కందారపు మురళి, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రయాగ్‌రాజ్‌లో ఊంజల్‌సేవ



ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా సందర్భంగా టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయంలో సోమవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీనివాసస్వామికి ప్రత్యేక ఊంజల్‌సేవను నిర్వహించారు. స్వామివారు వీణాపాణియై సరస్వతి అలంకారంలో ఊయలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు అన్నమయ్య సంకీర్తలను ఆలపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో వార్షిక విశేషపూజ



తిరుమల శ్రీవారి ఆలయంలో వార్షిక విశేషపూజను సోమవారం వసంతపంచమి పర్వదినం సందర్భంగా నిర్వహించారు. గతంలో వారపు సేవగా విశేషపూజను నిర్వహించేవారు. అయితే శ్రీవారి ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలనే సూచనతో దీనితోపాటూ వసంతోత్సవం, సహస్ర కలశాభిషేకంలను వార్షిక సేవలుగా గత టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఈమేరకు తొలిసారి వార్షి విశేషపూజను సోమవారం శ్రీవారి ఆలయంలోని కల్యాణమండపంలో నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఈపూజలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


పెరిగిన రద్దీ

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.34 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,706

తలనీలాలు సమర్పించినవారు: 23,340





ఇక బాజాభజంత్రీల మోత

- ప్రవేశించిన మాఘమాసం
- ఈనెల 2 నుంచి సుముహూర్తాలు
- బుక్ అయిపోయిన కల్యాణ మండపాలు
- మొదలైన పెళ్లి సందడి

మాఘమాసం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడనక్కరలేదు. నవ వధూవరులు పెళ్లి పీటలెక్కేందుకు రోజులు లెక్కపెట్టనక్కరలేదు. మాఘమాసం వచ్చేసింది. సుమూహూర్తాల మూటను మోసుకొచ్చేసింది. నిశ్చితార్థమయిన వారి ఇంట పెళ్లి సందడి తెచ్చేసింది. ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే ఈమాసానికి ఎంతో ప్రాధాన్యముందని ప్రగాఢంగా ప్రజలు విశ్వసిస్తారు. అందుకే మాఘమాసం వివాహాది శుభకార్యాలకు పెట్టింది పేరు. పెళ్లిళ్లు, అక్షరాభ్యాసాలు, నామకరణాలు లాంటివి ఈరోజుల్లోనే చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుంటారు. పెళ్లిళ్లయితే అన్నీ ఇన్నీ కాదు. ఈ సారి కూడా తిరుపతి నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా పెళ్లిళ్ల సంఖ్య గణనీయంగానే ఉంది. ముందుగానే కల్యాణమండపాలు బుక్కయిపోయాయి. పేరున్న పురోహితులంతా బిజీబిజీనే. కేటరింగ్ నుంచి బాజాభజంత్రీల వారివరకూ అందరూ ఒప్పందాలు కుదుర్చేసుకున్నారు. ఈనెల 2వ తేదీ నుంచి మార్చి 16 వరకూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. ఈఏడాది జూలై వరకూ కొన్ని ముహూర్తాలున్నాయంటున్నారు. నాలుగేళ్ల తర్వాత వరుస నెలల్లో శుభ కార్యాలు జరపుకొనేందుకు అవకాశం వచ్చిందంటున్నారు. ఈ క్రమంలో మాఘ మాసంలో పెళ్లిళ్లకు హడావుడి మొదలైపోయింది. వివాహంతో ముడిపడిన వివధ వర్గాల వారు ఏమంటున్నారో ఒకసారి తెలుసుకుందాం...

- తిరుపతి,నేరవిభాగం (ఆంధ్రజ్యోతి)

స్థాయిని బట్టి డెకరేషన్

పెళ్లంటే ఇప్పుడు అంతా అట్టహాసమే. ఒకప్పుడు సాదా సీదాగా చేసుకుని వెళ్ళే వారు. గతంలో కల్యాణ మండపాల్లో వేదిక డెకరేషన్ కోసం మహా అయితే రూ.30వేలు ఖర్చు పెట్టేవారు. కానీ రోజులు మారిపోయాయి. ఒకరిని చూసి మరొకరు అనుసరిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైరైటీ డెకరేషన్లపై ఆసక్తి చూపిస్తున్నారు. కనిష్ఠంగా రూ.50వేలయినా ఇందుకు కేటాయిస్తున్నారు. అక్కడ నుంచి స్థాయి,స్తోమతును బట్టి ఈ మొత్తం పెరిగిపోతోంది. రూ.2.50 లక్షలకు పైబడి ఎంతైనా వెచ్చించడానికి వెనుకాడటంలేదు. దీనికితోడు అన్ని రకాల మెటీరియల్ ధరలు పెరిగిపోయాయి. పూల ధలరను మరీనూ. బెంగళూరు నుంచి కొన్నిరకాల పుష్పాలను తెప్పిస్తున్నాం. మెహంది రకం పూల ఖరీదు బాగా పెరిగిపోయింది. వేదిక అలంకరణతో మెప్పించాలని పెళ్లివారు కోరుకుంటున్నారు.

- అరుణ డెకరేటర్, తిరుపతి



ఈ నెల ఎంతో శుభప్రదం



పురోహితులకు మాఘమాసమంతా బిజీగానే ఉంటుంది. ఈమాసానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఈనెలలో ఏ శుభకార్యక్రమం చేసినా విష్ణుఆరాధనతో సమానం. వైవాహిక జీవితం సాఫీగా సాగుతుందని బలమైన నమ్మకం. అందుకే శుభకార్యాలెక్కువగా ఈనెలలోనే చేస్తుంటారు. ఈసారి మాఘమాసంలోపెళ్లిళ్లు చేసుకోడానికి మంచి ముహూర్తాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ నెల 31 నుంచి మార్చి 16 వరకు ముహూర్తాలు ఉన్నాయి. ప్రధానంగా ఫిబ్రవరి 2,3,7,13,14,15,18,19,20,21,23,25లతోపాటు మార్చిలో 1,2,6,7,12,16 తేదీల్లో ఎక్కువ వివాహాలు జరుగుతాయి.

- రామశర్మ,పండితుడు, తిరుపతి

ఈవెంట్ మేనేజర్లదే హవా



ఒకప్పుడు స్థానిక ఫోటో, వీడియో గ్రాఫర్లకు డిమాండ్ వుండేది. ఇప్పుడు ఈవెంట్ మేనేజర్లు అందుబాటులోకి వచ్చారు. ఎక్కడో కూర్చుని భోజనాలు మొదలుకుని, :ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల వరకూ అన్ని పనులూ చేస్తామని ఎంగేజ్ చేసుకుంటున్నారు. ఖరీదైన స్టిల్ వీడియోలు అడుగుతున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్ని నైపుణ్యాలు ఉంటేనే ఈ రంగంలో రాణింపు ఉంటోంది. ఈతరహా ఈవెంట్లు చేసే వారు ఎక్కువగా విజయవాడ, తిరుపతి, బెంగళూరు వంటి నగరాల నుంచి వస్తున్నారు. కల్యాణ మండపాలను వారే లీజుకు తీసుకుని మరీ నిర్వహిస్తున్నారు. పెళ్లి చేసేవారు కూడా ఖర్చుకు వెనకాడటంలేదు.



- మురళి, ప్యాషన్ స్టూడియో, తిరుపతి



రుచి నాణ్యతల కోసం ఎన్ని కష్టాలో..

క్యాటరింగ్ ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. రుచికి,నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వివాహ భోజనంబు అన్నట్లుగా భోజనం బాగుంటే పెళ్లిబాగా అయినట్లు పెళ్లివారు భావిస్తుంటారు. దీంతో మామీద విపరీతమైన ఒత్తిడి ఉంటోంది. భోజనం బాగుందని తిన్నవారు చెబితే అదే మాకు పెద్ద పబ్లిసిటీ. అందుకోసమే చాలా తాపత్రయపడుతుంటాం. నిత్యావసర ధరలు పెరిగినా సరకులు



నాణ్యత లేక కస్టమర్లను సంతృప్తి పర్చడానికి చాలా కష్టపడాల్సి వస్తోంది. కమ్మని రుచితో ఘుమఘుమలాడే నెయ్యి దొరకడం గగనమైంది. ప్రస్తుత నూనెల పరిస్థితీ అలాగే ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా ఈ పనిలో నైపుణ్యత ఉన్న మనుషులు దొరకడంలేదు. ప్రస్తుతం వెయ్యి మందికి భోజనాలు ఆర్డర్లు ఇవ్వడం కష్టంగా ఉంది. మాకూ పోటీ పెరిగింది. అయినా మాఘమాసం కదా. అందరికీ చేతినిండా పని.

- చలపతి, అన్నపూర్ణ క్యాటరింగ్ సర్వీసు



పీజీఆర్ఎస్ వినతులు 220

● అధికారుల ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 220 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూకు సంబంధించి 116 అర్జీలు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచే జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చారు. 10.30 గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ వచ్చారు. అప్పటికీ వివిధ శాఖల ఉన్నతాధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడంతో ఆయన ఒకింత అసహనానికి గురయ్యారు. సమయానికి రాని అధికారుల నుంచి సంజాయిషీ తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు రోజ్మాండ్, దేవేంద్రరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



అధికారులు లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

తిరుపతి అర్బన్ కొరమేనుకుంట దేముడు కాలనీలో నివసిస్తున్న ఎరుకుల, యానాదుల కుటుంబాలకు కరెంటు మీటర్లు, ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్



చేశారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఆ ప్రాంతంలో 20ఏళ్లకు పైగా 130 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారని, వారికి కరెంటు మీటర్లు, మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, శివ, పద్మనాభరెడ్డి, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

సంఘమిత్ర మా సొమ్ము కాజేసింది

'మేము మహిళా పొదుపు సంఘంలో ఉన్నాం. తొట్టంబేడు యూనియన్ బ్యాంకులో రుణం తీసుకున్నాం. ప్రతినెలా రుణ సొమ్మును బ్యాంకులో జమచేయమని సంఘమిత్రలు మునిలక్ష్మి, మునిశేఖర్‌కు ఇచ్చాం.వారు ఆ నగదును బ్యాంకులో డిపాజిట్ చేయకుండా వాడుకున్నారు.న్యాయం చేయండి' అంటూ తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన మహిళలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.

పక్క రాష్ట్రాల మద్యం తెచ్చి విక్రయిస్తున్నారు



ఏర్పేడు మండలం పరమాలపల్లికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి బాలరాజు పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తూ యువతను చెడుదారి పట్టిస్తున్నాడని, జాతీయ రహదారికి ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా గదులు నిర్మించారని గ్రామస్తులు హరికృష్ణ, మల్లికార్జున కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు.







మంగళవారం జరిగే రథసప్తమి వేడుకల్లో సప్తవాహనాలపై స్వామివారిని దర్శించుకునేందుకు సోమవారమే తిరుమలకు చేరుకుని గ్యాలరీల్లో.. శ్రీవారి ఆలయం ముందు నిద్రిస్తున్న భక్తులు - మలయప్ప ఊరేగింపు సేవ కోసం సిద్ధమైన సూర్యప్రభ వాహనం



క్యాన్సర్ నిర్మూలన దిశగా అడుగులు

● జిల్లాలో జోరుగా స్క్రీనింగ్ పరీక్షలు ● స్విమ్స్, రుయాలో ప్రత్యేకవార్డులు

● నేడు ప్రపంచ క్యాన్సర్ దినం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఈక్రమంలోనే జిల్లా వ్యాప్తంగా స్క్రీనింగ్ పరీక్షలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు స్విమ్స్ ఆధ్వర్యంలో 11,554మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా 1850మందిని అనుమానితులుగా గుర్తించారు. స్వీకర్ ఆధ్వర్యంలో 48వేల మందికి పరీక్షలు నిర్వహించగా 573 మంది అనుమానితులను గుర్తించారు.

మూడు చోట్ల సేవలు

స్విమ్స్ ఆవరణలోని బాలాజి ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజి ఆధ్వర్యంలో 30 పడకలతో పెయిన్, పాలియేటివ్ కేర్ వార్డును అందుబాటులోకి తీసుకువచ్చారు. చివరి దశ రోగులకు తొలుత చికిత్స అందించనున్నారు. టాటా ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్(స్వీకర్), రుయాలో 10 పడకల పాలియేటివ్ కేర్ కేంద్రం క్యాన్సర్ రోగులకు విశేష వైద్య సేవలందిస్తున్నాయి. స్విమ్స్ పాలియేటివ్ కేర్ వార్డులో ఆరోగ్యశ్రీ వర్తించదు. దీనిని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు బీఐవో ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డి తెలిపారు.

కేర్ ట్రాకర్ యాప్ ద్వారా సలహాలు

కేర్ ట్రాకర్ యాప్ క్యాన్సర్ రోగులకు ఉపయోగపడుతోంది. స్విమ్స్‌లో చికిత్స పొందిన వారి ఫోన్‌లో మొదట ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ కలిగిన రోగుల, వారి సహాయకుల ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రోజు వారి ఆరోగ్య పరిస్థితిని యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలను వైద్య బృందం పరిశీలిస్తుంది. అవసరమైతే వెంటనే వైద్య సలహాలను అందిస్తారు. లేదా ఆస్పత్రికి రావాల్సింగా సూచిస్తారు.

ఉపశమనం కోసమే పాలియేటివ్ కేర్

పాలియేటివ్ కేర్ వార్డును క్యాన్సర్ బాధితులకే కాకుండా న్యూరాలజి, నెఫ్రాలజి, సీవోపీడి బాధితులకు కూడా అందుబాటులోకి తీసుకువస్తాం. వ్యాధి ముదిరి చివరి దశలో ఉన్న వారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సి ఉంటుంది. వారికి నిత్యం వైద్య పర్యవేక్షణ అవసరం ఉంటుంది. అలాంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తాం



- డాక్టర్ ప్రాణబంధుదాస్, రేడియోషన్, అంకాలజి వైద్య నిపుణులు

దారి దోపిడీ కేసులో ఇద్దరు ఆటో డ్రైవర్ల అరెస్టు

● 24 గ్రాముల బంగారు నగలు, రెండు ఆటోలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడిని బెదిరించి బంగారు నగలు లాక్కెళ్లిన ఘటనలో ఇద్దరు ఆటో డ్రైవర్లను తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కాట్పాడికి చెందిన గోవిందరాజులు సురేష్‌బాబు గత నెల 12న తిరుమలకు వచ్చారు. తిరుపతికి వచ్చిన ఈయన ఆటో ఎక్కారు. ఆ ఆటో డ్రైవరు మున్నూరు శివాజీ.. కొంత దూరం వెళ్లాక చెన్నారెడ్డి కాలనీకి చెందిన మరో ఆటో డ్రైవర్ చిన్నస్వామి కిరణ్‌కు ఫోన్‌చేసి రప్పించాడు. వీరిద్దరూ కలిసి సురేష్‌బాబును చితకబాది 24 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు వెస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరత్నం, సిబ్బంది నిందితుల కోసం గాలించారు. ఆటో డ్రైవర్లు వాడుతున్న మొబైల్ నెంబర్ల ఆధారంగా ట్రాక్ చేసి సోమవారం సైన్సు సెంటరు వద్ద శివాజీ, చిన్నస్వామి కిరణ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు నగలు, రెండు ఆటోలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని సీఐ చెప్పారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

13 కిలోల గంజాయి పట్టివేత

పాకాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. నెల్లూరు రూరల్ మండలం అల్లిపురం మేకలవారి తోటకు చెందిన సాన విష్ణుమోహన్ రెడ్డి, తమిళనాడుకు చెందిన ఆర్.పాండ్యన్‌లు విజయవాడ నుండి మదురై తరలించేందుకు 13 కేజీల గంజాయిని ఆదివారం పాకాల రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సమాచారం తెలుసుకుని సీఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఐ సంజీవరాయుడు, తహశీల్దార్ సంతోష్‌సాయి పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకొని గంజాయి, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు.



నిందితులతో సీఐ సుదర్శన ప్రసాద్, పోలీసులు

17 నుంచి తిరుపతిలో ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో

● పాల్గొననున్న 58 దేశాల ప్రతినిధులు

తిరుమల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆలయ మహాసభ, ఎక్స్‌పో 2025 కార్యక్రమం తిరుపతిలో ఈ నెల 17 నుంచీ మూడు రోజులపాటూ జరగనుంది. ంగళంరోడ్డులోని ఆశా కన్వెన్షన్‌లో సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయ నిర్వహణపై నిపుణుల చర్చలు, ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, శిక్షణా తరగతులు.. ఈ సదస్సులో ఉంటాయి. 58కి పైగా దేశాల నుంచి 1,500 మంది హిందు, సిక్కు, బౌద్ధ, జైన సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నారు. 2023లో తొలిసారిగా అంతర్జాతీయ ఆలయ మహాసభ, ఎక్స్‌పో(ఐటీసీఎక్స్) వారణాశిలో జరిగింది. ప్రధాని నరేంద్రమోదీతో పాటు హోంమంత్రి అమిత్‌షా వంటి ప్రముఖులు పాల్గొన్నారు. రెండవ ఎక్స్‌పో తిరుపతిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో చైర్మన్ ప్రసాద్‌లాల్, టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరీష్ కులకర్ణి నేతృత్వం ఈసదస్సు జరుగనుంది.

చిరుత సంచారంతో..!

● ఎస్వీయూ లైబ్రరీ వెనుక చెట్ల పొదల తొలగింపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిరుత సంచారం నేపథ్యంలో ఎస్వీ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ వెనుకగల చెట్ల పొదలను సిబ్బంది తొలగిస్తున్నారు. లైబ్రరీ చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రం చేస్తున్నారు. చిరుత పులి ఇటీవల లైబ్రరీ వెనుక జింకను చంపి తినడం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. దీంతో లైబ్రరీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఆదేశించారు. లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు, గార్డెనింగ్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ కోటగారం మురళి నేతృత్వంలో రెండు, మూడు రోజులుగా లైబ్రరీ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. తద్వారా చిరుత భయంతో వణుకుతున్న విద్యార్థులు, ఉద్యోగులకు కొంత ధైర్యం కలిగేలా చేస్తున్నారు.

రేపు ఎస్వీయూలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఖాళీగా ఉన్న ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టారు. ఉదయం 10 గంటలకు అడ్మిషన్ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుంది. ఈఏపీసెట్-24 అర్హత కల్గిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ చదువుకున్న వారు అర్హులని వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 52 వినతులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో క్రైం అదనపు ఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 52 వినతులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను పోలీసులకు వివరించారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

ఏడాదిలోగా అర్హులందరికీ టిడ్కో ఇళ్లు



టిడ్కో చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఏడాదిలోగా టిడ్కో ఇళ్లు అందజేస్తామని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం వెంకటగిరిలోని టిడ్కో ఇళ్ల వద్ద లబ్ధిదారులతో ముఖాముఖీ నిర్వహించారు. నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చాలన్న ధ్యేయంతో గతంలో సీఎంగా చంద్రబాబు 4.52 లక్షల టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తే.. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ఆ సంఖ్యను 2.16 లక్షలకు కుదించారన్నారు. పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు టిడ్కో ఇళ్ల రుణాలు చెల్లించాలని బ్యాంకుల నుంచి ఒత్తిడి పెరగడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. టిడ్కో ఇళ్లలో యజమానులు నివాసం ఉండకుండా ఇతరులకు అద్దెకు ఇస్తే రద్దు చేయించి బాడుగకు ఉన్నవారికే కేటాయిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. టిడ్కో ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, శ్రీరామదాసు గంగాధర్, కేవీకే ప్రసాద్ నాయుడు, జనసేన నాయకులు తోటా కృష్ణయ్య, జంపాల ప్రకాష్, కస్తూరి, గునకల కిషోర్, రామారావు అనిల్‌కుమార్, రాదమ్మ, చిరంజీవి, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ, ఎంవీఐ

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పుత్తూరు ఎంవీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం స్థానిక జ్ఞాన జ్యోతి పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సీఐ సురేంద్రనాయుడు, ఎంవీఐ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ఆవశ్యకత, అతివేగం, మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, లైసెన్సు లేకుండా డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. రహదారి భద్రత, ప్రమాదాల నియంత్రణలో సాంకేతిక పాత్రను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను తెలియజేశారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ హరనాథ రెడ్డి, కానిస్టేబుల్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి నిమిత్తం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రుణ మంజూరుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 7వ తేదీలోగా దరఖాస్తులను సచివాలయంలోగానీ, ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈబీసీ ధ్రువపత్రం కలిగిన బీసీ, బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపులు(తెలగ, బలిజ, ఒంటరి) కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, రేషన్ కార్డు, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్, బ్యాంక్ పాస్‌బుక్ నకళ్లు జతచేయాల్సి ఉంటుందన్నారు.

ఉత్తమ ఉద్యోగ అవార్డు గ్రహీతలకు సన్మానం


ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా పుత్తూరు యూనిట్ పరిధిలో ఉత్తమ ఉద్యోగ అవార్డు గ్రహీతలను ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏజీఈఎస్) ఘనంగా సత్కరించింది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ విచ్చేశారు. మున్సిపల్ మేనేజర్ మణిశంకర్, వడమాలపేట ఆర్ఐ జానీబాషా, సత్యనారాయణ కాలనీ వీఆర్వో ఆశా సహా తొమ్మిదిమందిని ఘనంగా సన్మానించారు. సంఘం సభ్యుడు శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాద మృతులకు ఎమ్మెల్యే నివాళి


రాజేంద్రనాయుడికి నివాళులర్పిస్తున్న భానుప్రకాష్

వడమాలపేట, ఫిబ్రవరి 3(ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో సీతారామపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెళ్లికి వెళ్లి తిరిగి వస్తూ నగరి వద్ద ఆదివారం రాత్రి టీడీపీ నాయకులు పార్థసారథి నాయుడు(62), రాజేంద్ర నాయుడు(60) మృతి చెందిన విషయం తెలిసిందే. ఇద్దరు బంధువులు కావడంతో టీడీపీ అభిమానులు భారీగా తరలివచ్చి భౌతికకాయాలకు నివాళులర్పించారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా పార్థసారథి నాయుడు, రాజేంద్ర నాయుడు భౌతికకాయాలకు ఎమ్మెల్యే భానుప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వీరిద్దరి ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటన్నారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేయించండి


టిడ్కో చైర్మన్‌తో జనసేన నాయకులు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లను పూర్తి చేయించి లబ్ధిదారులకు అందించాలని నగరి నియోజకవర్గ జనసేన నాయకుడు మహేష్ ఆధ్వర్యంలో తిరుపతికి విచ్చేసిన టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పుత్తూరు, నగరి పట్టణాలకు చెందిన పేదల కోసం గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించ తలపెట్టిందన్నారు. పులువురు పేదలు తలా రూ.లక్షను డిపాజిట్‌గా చెల్లించారన్నారు. అయితే ప్రభుత్వం మారడం వైసీపీ అధికారం చేపట్టడంతో ఆ ఇళ్ల నిర్మాణాలను అర్ధంతరంగా ఆపేసిందన్నారు. అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి, లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. నాగార్జున, వెంకటముని, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా సభ్యుడు మహేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో శ్రీ బాలాజీ లారీ లోడింగ్ అన్‌లోడింగ్ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన హమాలీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా మునిరత్నం, కోశాధికారిగా గంగాధరం, గౌరవాధ్యక్షుడిగా మహేష్, ఉపాధ్యక్షుడిగా కులవర్దన్, సహాయ కార్యదర్శిగా సుధాకర్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటముని, సొరకాయలు, బాలాజీ, చంద్ర, బాబు, హరి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షలతో ప్రహరీ నిర్మాణం

● మున్సిపాలిటీ నిధులు వృథా



పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ అధికారుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వర్షపాతాన్ని కొలిచే యంత్రం(రెయిన్ గేజ్) ఉంది. ఈ యంత్రానికి చుట్టూ ఫెన్సింగ్ ఉంది. అయితే దాన్ని తొలగించి రూ.2.50 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి సోమవారం చర్యలు చేపట్టారు. అసలే నిధులు లేక ప్రజా ప్రయోజనాలకు అవసరమైన అత్యవసర పనులు చేపట్టడం లేదు. ఈ వృథా ఖర్చు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులు వాదన మరోలా ఉంది. మున్సిపల్ కార్యాలయ ఆవరణాన్ని ప్రజలు రహదారిగా వినియోగిస్తున్నారని, అందుకే ప్రహరీ నిర్మిస్తున్నట్టు చెప్పుకొచ్చారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మంగానెల్లూరులో చోరీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగానెల్లూరులో జువ్వలపాటి సుబ్బులయ్య, నీలమ్మ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు.. సుబ్బులయ్య, నీలమ్మ దంపతులకు ఆరోగ్యం బాగలేకపోవడంతో శనివారం మధ్యాహ్నం శ్రీకాళహస్తిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. రాత్రి శ్రీకాళహస్తిలోనే బంధువుల ఇంట్లో ఉన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఇంటికి రావడంతో తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 10 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేల కనిపించలేదు. వెంటనే సూళ్లూరుపేటకు చేరుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు సిబ్బందితో మంగానెల్లూరుకు వెళ్లి చోరీ జరిగిన ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం బాపూజీ వీధి లక్ష్మీ భవన్ హోటల్ సమీపంలో నిలిపి వుంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని యువకుడు అపహరించుకొని వెళ్లిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. వట్రపాలెం ప్రాంతానికి చెందిన ప్రశాంత్ తన భార్య కుమారితో కలిసి స్కూటీలో సూళ్లూరుపేట వచ్చాడు. లక్ష్మీ భవన్ హోటల్ సమీపంలో పార్కింగ్ చేసి సమీపంలో తోపడు బండిలో పిల్లలకు బట్టలు కొనేందుకు వెళ్లాడు. అర్ధగంటలో తిరిగి రాగా స్కూటీ కనిపించలేదు. స్థానికులను చారించగా ఓ యువకుడు వచ్చి తీసుకెళ్లినట్లు తెలిపారు. పక్కనే ఓ షాపులో ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఓ యువకుడు స్కూటీ వద్దకు వచ్చి స్టార్ట్ చేసుకొని వేగంగా వెళ్లినట్లు కనిపించింది. బాధితుడు వెంటనే స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేడు చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.



సూళ్లూరుపేట మన్నారుపోలూరులో ఆగిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంక్ - నిరుపయోగంగా ఉన్న పైపులు

సమ్మర్ స్టోరేజి పనులకు గ్రహణం

- ఏఐఐబీ నిధులు రూ.324 కోట్లు మంజూరు
- వైసీపీ రివర్స్ టెండర్‌తో తీవ్ర జాప్యం
- బిల్లులు చెల్లించకపోవడంతో ఆగిన పనులు

నాయుడుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల ప్రజల దాహార్తి తీర్చేందుకు చేపట్టిన సమ్మర్ స్టోరేజి పనులకు గ్రహణం పట్టింది. ఏఐఐబీ నిధులు రూ.324 కోట్లు మంజూరైనా... అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు 2018లో ప్రారంభమైన సమ్మర్ స్టోరేజి పనులు ఆరేళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. నాయుడుపేట మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో సుమారు 66 వేలు, సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో 55 వేల మంది జనాభా ఉన్నారు. ఈ పట్టణాలకు తాగునీరు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో సమ్మర్ స్టోరేజ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నుంచి రూ.324 కోట్లు మంజూరయ్యాయి. రెండేళ్లలో పూర్తి చేసే ఒప్పందంతో ఎన్‌సీసీ కంపెనీ పనులు చేపట్టింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి.

వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండర్

వైసీపీ అధికారంలోకి రాగానే 25 శాతం కూడా పూర్తికాని పనులను ఆపేసి రివర్స్ టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో సమ్మర్ స్టోరేజి పనులకూ రివర్స్ టెండర్ పిలిచింది. మళ్లీ ఎన్‌సీసీ కంపెనీనే రూ.324 కోట్లతో పనులు దక్కించుకుంది. అయితే నాయుడుపేట మండలంలో తిమ్మాజికండ్రిగ చెరువు కన్నా జువ్వలపాళెం చెరువు విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో అక్కడ, సూళ్లూరుపేట మున్సిపాలిటీలో మొదట చేపట్టిన విధంగా మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజి ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు ఇచ్చింది.

బిల్లులు చెల్లించక.. ఆగిన పనులు

నాయుడుపేట పాత ఆర్డీవో కార్యాలయం వద్ద 10 లక్షల లీటర్లు, బీఎంఆర్ నగర్‌లో 8.5 లక్షల లీటర్లు, స్వర్ణముఖినది సమీపంలో 9లక్షల లీటర్లు, సూళ్లూరుపేట మన్నారుపోలూరులో 9 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టారు. నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో దాదాపు 108 కిలోమీటర్ల పైపులైన్‌లు నిర్మించాల్సి ఉండగా 50 కిలోమీటర్లు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే బిల్లుల చెల్లింపులో వైసీపీ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడంతో ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని సమ్మర్ స్టోరేజి పనులు పూర్తిచేసి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజి గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులను పునః ప్రారంభిస్తామని చెప్పారు.

యోగాతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు


యోగా గురువు వసంతలక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చనని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యోగాసనాల్లో గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించిన యోగా గురువు వసంతలక్ష్మిని ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి ప్రాంతానికి చెందిన వసంతలక్ష్మి యోగాలోని సమకోణాసనంలో 3గంటల 42నిమిషాల సమయం ఉండి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. యోగా ద్వారా ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు స్వయం ఉపాధిని పొంద వచ్చునన్నారు. పట్టుదలతో కష్టపడితే దేనినైనా సాధించవచ్చునని వసంతలక్ష్మి రుజువు చేశారన్నారు. వసంతలక్ష్మి మాట్లాడుతూ యోగా ద్వారా ఏకాగ్రత పెరుగుతుందన్నారు. చిన్నతనం నుంచే తమ పిల్లలకు యోగాపై తల్లిదండ్రులు శిక్షణ అందజేయాలన్నారు. అనంతరం వసంతలక్ష్మిని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆయన సతీమణి సంధ్యారాణి సన్మానించారు. కార్యక్రమంలో పెన్వర్ కంపెనీ డెరెక్టర్ గంటా మధుకృష్ణ, గాయత్రి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, కల్పన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు దోచేసి.. ఇప్పుడు రీచ్‌ను రద్దు చేయాలా?: టీడీపీ


సమావేశంలో టీడీపీ నేతలు కృష్ణయ్య, ప్రసాద్ నాయుడు, మురళీ నాయుడు, కృష్ణమనాయుడు, సిద్దులయ్యనాయుడు

పెళ్లకూరు, ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని స్వర్ణముఖినదిలో ఇసుకను దోచేసిన వైసీపీ నేత చిందేపల్లి మధుసూదనరెడ్డి ఇప్పుడు రీచ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు అన్నారు. సోమవారం పెళ్లకూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు అవసరమైన ఇసుకను ఉచితంగా అందజేస్తోందన్నారు. స్వర్ణముఖినదిలో రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ మోటార్లకు ఇబ్బంది లేకుండా ధికారులు చర్యలు తీసుకున్నారన్నాని చెప్పారు. పారదర్శంగా జరుగుతున్న ఇసుక పంపిణీని జీర్ణించుకోలేక రీచ్‌ను రద్దు చేయాలని గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శాఖమూరి కృష్ణమనాయుడు, మాడుపూరు మురళీ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, జడపల్లి వెంకటేశ్వర్లు, చంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల జోలికొస్తే చర్యలు


మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల జోలికి వస్తే ఎంతటి వారైనా చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా హెచ్చరించారు. సోమవారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల స్థలంలోని అక్రమ లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ సెలవులో ఉండగా కొంతమంది రాళ్లు నాటారని, దానిపై ఫిర్యాదు రావడంతో సర్వే చేయించి రాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఆర్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ వెంకటశర్మ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీసిటీలోని దాదాపు 10 పరిశ్రమలు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. లో ఓల్టేజ్ సమస్య ఉండడంతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కోళ్లమిట్ట, ఎర్రపాలెం ప్రాంతాల కోసం అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసులు, ఏడీఈ శేఖర్, ఏతలు మురళి, మోహిని, పూర్ణిమ, ఎల్ఐ సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేత

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో జనజీవనానికి ఇబ్బంది కలిగిస్తున్న కోతులను సోమవారం పట్టివేశారు. పట్టణంలోని రాజగోపాలపురం, రామకృష్ణాపురం, వెంకటేశ్వరపురం, గెరిడీవీధి, గిండివారితోట, అమరాగార్డెన్, పిచ్చిరెడ్డితోపు, టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కోతులు ఇళ్లల్లోకి చొరబడి వస్తువులు తీసుకుపోవడంతో పాటు ఇబ్బందులు కలిగిస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు ఫిర్యాదులు అందాయి. దీంతో పట్టణంలో 210 కోతులను పట్టించి రాపూరు అడవుల్లో వదిలిపెట్టారు.

టిడ్కో ఇళ్లను కేటాయించండి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీలో ఇళ్లు లేని పేదలకు టిడ్కో గృహాలను కేటాయించాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. సోమవారం స్థానిక 8వ సచివాలయం వద్ద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

మున్సిపల్ కార్మికులకు వేతన బకాయిలను చెల్లించండి

నాయుడుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు మధు, హరికృష్ణ, మహాలక్ష్మమ్మ, నెలవల మణి, ఆరావళి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయగణపతి ఆలయ వార్షికోత్సవం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో వెలసిన విజయగణపతి ఆలయంలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. విజయగణపతికి పాలాభిషేకం, అష్టోత్తర పూజలు చేశారు. రాత్రి ప్రత్యేక పుష్పాలంకరణలో విజయ గణపతికి నగరోత్సవం జరిపారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

కోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్ బాలభారతీ విద్యాసంస్థల సమీపంలో డివైడర్‌ను సోమవారం రాత్రి ఓ కారు ఢీకొట్టింది. నెల్లూరుకు చెందిన కొంతమంది వ్యాపారులు కారులో కోటకు వస్తుండగా విద్యానగర్ సమీపంలో డివైడర్‌ను వేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. కారు రెండు టైర్లు పగిలిపోగా ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది.

పెన్సిల్ ఆర్ట్ బహూకరణ



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను వెంకటగిరికి చెందిన పెన్సిల్ ఆర్టిస్టు పోలిశెట్టి శంకర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పెన్సిల్‌తో గీసిన అజయ్‌కుమార్ చిత్రాన్ని ఆయన బహూకరించారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

కోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం వెంకన్నపాళెంలో ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల రైతులు ధాన్యాన్ని అమ్ముకొంటున్నా మద్దతు ధర లభించ నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోటేశ్వరరావు కోరారు.

నేలపట్టు, పులికాట్ అభివృద్ధికి శ్రీసిటీ ఫౌండేషన్ రూ.10 లక్షల విరాళం



సీసీఎఫ్ సెల్వంకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న శ్రీసిటీ డైరెక్టర్ నిరీషారెడ్డి, పక్కన డీఎఫ్‌వో హారిక, ఎఫ్ఆర్‌వో సౌజన్య తదితరులు

శ్రీసిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలైన నేలపట్టు, పులికాట్ పక్షుల రక్షిత కేంద్రాల్లో అభివృద్ధి పనుల కోసం శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలను శ్రీసిటీ డైరెక్టర్ సన్నారెడ్డి నిరీషారెడ్డి అందజేశారు. సోమవారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో చిత్తడి నేలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీసిటీ డైరెక్టర్ నిరీషారెడ్డి, తిరుపతి సీసీఎఫ్(చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సెల్వం, సూళ్లూరుపేట డీఎఫ్‌వో హారిక విచ్చేశారు. సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో పలు పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. నీరు, వన్యప్రాణులు, కలగలిసిన చిత్తడి నేలల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య, స్థానిక వన్యప్రాణి సంరక్షణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మెహబూబ్‌బాషా

గూడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ మెహబూబ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యాలను పెపొందించేలా శిక్షణ అందజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవీలక్ష్మి, వ్యాయమ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు భూముల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంట్రంగం అంగీరి చెరువు భూములను కొందరు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని పంట్రంగం గ్రామస్తులు సోమవారం తిరుపతిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. పంట్రంగ అంగీరి చెరువుకు సంబంధించి సర్వే నెంబరు 5లో సుమారు 12 ఎకరాలను రాగన్నపట్టెడ గ్రామానికి చెందిన నాగరాజు, మరికొంతమంది ఆక్రమించుకొని సాగు చేసుకొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా దిగువ భాగంలో ఉన్న వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు దారి లేకుండా ఆక్రమణ దారులు కంచె ఏర్పాటు చేసుకొన్నారని వివరించారు. చెరువు భూముల ఆక్రమణ దారులపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి: విజయశ్రీ


రోగులను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, పక్కన మాజీ ఎంపీ నెలవల, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు

నాయుడుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యకరంగా ఉండగలుగుతామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట తుమ్మూరులో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె రోగులను పరీక్షించారు. చికున్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, జలుబు, దగ్గు వంటి వాటిపట్ల ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ చేరకుండా చూడాలన్నారు. దోమల నివారణకు బైటెక్స్ వంటి దావణాలను పిచికారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, పసల గంగాప్రసాద్, పసల పెంచలయ్య, మైలారి రాజశేఖర్, పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, అవధానం సుధీర్, శివాజీరెడ్డి, దార్ల రాజేంద్ర, గుంటూరు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలిస్తారా... గుడిసెలు వేసుకోమంటారా

● సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న మురళి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులకు ఇంటి స్థలాలిస్తారా లేకపోతే గుడిసెలు వేసుకోమంటారా అని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇంటి స్థలాలు కోసం సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కనమనంబేడు దళితులకు ఇంటి స్థలాలు మంజూరు కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు కలసి జీవిస్తున్నాయన్నారు. మండల కేంద్రంలోని సర్వే నెం.252, 253లలో ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాలుగా ఇవ్వాలని పలు దఫాలుగా రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆ భూమిని ఆక్రమించి కంచె వేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. అయితే దళితులు కంచె తొలగిస్తే కేసులు బనాయించారని చెప్పారు. 10వతేది లోగా దళితులకు పట్టాలివ్వకపోతే తామే గుడిసెలు వేసుకుంటామన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్యలు దళితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫిష్ పాండ్లతో మేత ఖర్చుల్లో ఆదా


పనులను పర్యవేక్షిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఫిష్ పాండ్ల తవ్వకంతో మేత ఖర్చుల్లో ఆదా అవుతుందని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. ఏర్పేడు మండలం అముడూరు పంచాయతీలో ఉపాధి కూలీల ఆధ్వర్యంలో ఫిష్ పాండ్ తవ్వకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిష్ పాండ్‌ను చెరువుల్లో తవ్వితే చేపల పెంపకానికి లీజుకు ఇచ్చినపుడు లీజుదారులు చిన్న చేపలను ఈ గుంతల్లో వదిలి పెంచడం వలన మేత ఖర్చులు తగ్గుతాయన్నారు. అదే విధంగా చేపలు తొందరగా ఎదుగుతాయన్నారు. అనంతరం మల్లంపల్లిలో నిర్మించిన క్యాటిల్‌షెల్టర్‌ను, రాజులపాళెంలో నిర్మించిన సిమెంట్‌రోడ్డు పనులను పరిశీలించారు. చంద్రశేఖర్‌రాజు, దేవరి, బాలాజీరావు, శాలి మనోహర్, వెంకటాద్రి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ ఇంట్లో చోరీ




ఇంట్లో బీరువా, అల్మరాను చిందరవందర చేసిన దొంగలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని బంగారమ్మకాలనీలో సోమవారం వెలుగు చూసింది. బాధితుడి తెలిపిన వివరాలు... పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఆర్‌ఎంపీ మోహన్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తుంటాడు. ఇక్కడికి సమీపంలోనే నివాసగృహం ఏర్పరచుకున్నాడు. నాలుగు రోజులక్రితం కుటుంబంతో కలిసి ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు వెళ్లారు. ఈ నెల 1న గుర్తు తెలియని దొంగలు ఆర్‌ఎంపీ ఇంటి తలుపు తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. ఇంట్లోని 40గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేల డైమండ్ లాకెట్, సుమారు కిలో వెండి పూజా సామాగ్రి, రూ.50వేలను చోరీ చేశారు. ఆదివారం ఇంటి తలుపలు తెరచి ఉండటాన్ని గమనించిన స్థానికులు మోహన్‌కు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీనిపై 2వ పట్టణ పోలీసులకు మోహన్ ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో జరిగిన చోరీపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో మోహన్ ఇంటితో పాటు మారో నాలుగు ఇళ్లల్లో కూడా చోరీ జరిగినట్లు సోమవారం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి కనీస స్పందన రాలేదని స్థానికులు మోహన్ ఇంటి వద్ద నిస్సహాయతను వ్యక్తం చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. పట్టణంలోని గంగా సదన్ వసతిగృహాల వద్ద ఖాళీ ప్రదేశాల్లో పారవేసిన వ్యర్థాలు, ఖాళీ మద్యం సీసాలను పురపాలకసంఘ సిబ్బంది సాయంతో తొలగించారు. అనంతరం ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

గోపురం బాధితులకు చెక్కుల అందజేత




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి రాజగోపురం బాధితులకు సోమవారం ఈవో బాపిరెడ్డి చెక్కులను అందజేశారు. సుమారు 13 సంవత్సరాల తరువాత మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం ఆర్.ఎస్.మాల, వి.సుశీలమ్మకు నష్టపరిహార చెక్కులను అందజేశారు.

అండర్-16 కబడ్డీ పోటీలకు నవీన్‌కుమార్ ఎంపిక

పిచ్చాటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర అండర్-16 కబడ్డీ పోటీలకు పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వి.నవీన్‌కుమార్ ఎంపికయ్యాడు. కడప జిల్లా మైదుకూరు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-16 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచడంతో ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డిల్లీబాబు మాట్లాడుతూ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈనెల 7, 8, 9, 10 తేదీల్లో జరిగే పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు.

శివరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



రేణిగుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదళ్లచెరువులో కొలువై ఉన్న ఓంకార జ్యోతిలింగేశ్వర ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ... ఉత్సవాలను రెండు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆలయ ధర్మకర్త కృష్ణయ్యస్వామి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జయరాములు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నారాయణవనం తహసీల్దార్ జయరాములును పిచ్చాటూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించినట్టు తెలిసింది.

ప్రమాదకరంగా ప్రభుత్వాస్పత్రి ప్రవేశద్వారం


ప్రభుత్వాస్పత్రి ప్రధాన గేటు వద్ద ఇరుక్కున్న ఆటో

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రవేశ ద్వారం ప్రమాదకరంగా మారింది. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద కుక్కలు, పందులు, ఆవులు వంటి జంతువులు ప్రవేశించకుండా పైపులను ఏర్పాటు చేశారు. గత కొద్ది నెలలుగా ద్వారం వద్ద అవి కుంగిపోయాయి. కొన్నిచోట్ల విరిగిపోయాయి. దీనిని ఎవరూ పట్టించుకోకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వాహనదారులు పలుమార్లు అదుపు తప్పారు. ఇక రాత్రి వేళల్లో అయితే పాదచారుల కాళ్లు ఇరుక్కుపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. తాజాగా సోమవారం ఒక ఆటో చక్రం అందులో ఇరుక్కుంది. స్థానికులు సహకారంతో ఆటోను వెనక్కు లాగాల్సి వచ్చింది. ఇకనైనా అధికారులు స్పందించి ప్రవేశ మార్గాన్ని బాగు చేయాల్సిన అవసరం ఉంది.

టిడ్కో గృహాలను నిర్వీర్యం చేశారు

టిడ్కో చైర్మన్ వేములపాటి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన న్యూఎన్టీఆర్‌నగర్‌లో(టిడ్కో ఇళ్లు) లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో పేదల కోసం 7వేల టిడ్కో ఇళ్లను మంజూరు చేయించారన్నారు. మొదటి విడతలో 2,619 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు మంజూరు చేసి వసతులు కల్పించే క్రమంలో ప్రభుత్వం మారిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు గృహాలు అప్పగించకపోగా టిడ్కో ఇళ్లను నిర్వీర్యం చేసిందన్నారు. గోడలకు పార్టీ రంగుల కోసం వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఆ డబ్బులతో మౌలిక వసతులు కల్పించి నట్లయితే ఎంతో మంది పేదవారు ఆ ఇళ్లల్లో ఉండేవారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. త్వరలో ఎమ్మెల్యే ఆ ఇళ్లను పరిశీలిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరికి టిడ్కో ఇళ్లను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకుడు మిన్నల రవి, జనసేన నాయకులు కోట వినుత, కొట్టేసాయి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వసంత పంచమి

శాస్త్రోక్తంగా సరస్వతి పూజ




శ్రీకాళహస్తీశ్వరాలయంలో, బీఎన్‌కండ్రిగ అక్షర స్కూల్‌లో అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పర్వదినాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయం సహా పలు పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. విద్యకు ఆదిదేవత అయిన సరస్వతిదేవి వసంత పంచమిన జన్మించినట్లు భావిస్తుంటారు. ఈ పర్వ దినాన పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహిస్తుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉదయం నుంచే వసంతపంచమి సందడి నెలకొంది. ఆలయంలోని మృత్యుంజయలింగం ప్రాంగణంలో పెద్దఎత్తున భక్తులు తమపిల్లలకు వేదపండితులతో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం తొలి అక్షరాలను పిల్లల చేత దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. ఇక పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో, ఎంజీఎం పాఠశాలలో కూడా అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల, బీఎన్ కండ్రిగ అక్షర పాఠశాలల్లో వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. కల్లివెట్టు పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహానికి హెచ్‌ఎం రూపేష్ కుమార్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా మండలంలో పలు పాఠశాలల్లో సరస్వతి పూజలను నిర్వహించి చిన్నారులకు వేదపండితుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు.

రెండు ప్రమాదాల్లో ఆవుల మృతి


కొత్తపాళెం వద్ద మృతి చెందిన ఆవు

రేణిగుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం రాత్రి రెండు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో రెండు పశువులు మృతి చెందాయి. ఒక ప్రమాదంలో గర్భంతో ఉన్న గోమాత మృతి అందరినీ కలచివేసింది. ఏర్పేడు మండలం మునలిపేడు నుంచి ప్రయాణికులతో తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సు కొత్తపాళెం వద్ద రోడ్డు దాటుతున్న పశువును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రరక్తగాయాలకు గురైన ఆ పశువు కొంతసేపు ప్రాణాలతో కొట్టుమిట్టాడి మృతి చెందింది. పరిశీలించిన స్థానికులు ఆ పశువు గర్భంతో ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు మహిళా రైతు ఈ ప్రమాదంపై గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాత విమానాశ్రయం రోడ్డులో ఓ కారు అతివేగంగా వెళుతూ రోడ్డు దాటుతున్న గోవును ఢీకొనడంతో ఆ పశువు అక్కడికక్కడే మృతి చెందింది.

దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారణిలో గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు సర్పంచు పద్మమ్మ సోమవారం మట్టిని తోలి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. భారీ వర్షాలతో వెస్ట్‌వరత్తూరు మెయిన్ రోడ్డు నుంచి కారణి వచ్చే ప్రధాన రోడ్డు గుంతల ఏర్పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. దీంతో స్పందించిన సర్పంచు మట్టిని తోలారు.

కర్నూల్‌లో హైకోర్టు బెంచి ఏర్పాటు... నిరసనగా శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ రాజీనామా

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కర్నూల్‌లో హైకోర్టు బెంచి ఏర్పాటు అంశాన్ని నిరసిస్తూ శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ మూకుమ్మడిగా రాజీనామా చేసింది. ఈ మేరకు శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడుపూరు ప్రసాద్‌నాయుడు రాజీనామా చేస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. తిరుపతి జిల్లావాసులకు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమరావతిలోని హైకోర్టు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అదే కర్నూలులో హైకోర్టు బెంచీ ఏర్పాటైతే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడం ఇబ్బందికరమన్నారు. కాబట్టి ఈ అంశాన్ని శ్రీకాళహస్తి బార్‌అసోసియేషన్ తీవ్రంగా నిరసిస్తూ రాజీనామా చేసినట్లు వెల్లడించారు. అమరావతిని కొనసాగించేలా తమ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పూజలు చేపట్టారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గంగమ్మ ఆలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే

పిచ్చాటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని వేలూరులో సోమవారం ఉదయం నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయ కుంభాభిషేక పూజల్లో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు, గ్రామ పెద్దలు ఆలయ మర్యాదలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరి స్తానని స్పష్టం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, టీడీపీ నాయకులు వెంకటరత్నం నాయుడు, జయచంద్రనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వేహెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలు... ఏర్పేడు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని స్వాధీనం చేసుకుని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ప్రస్తుతం అతను కోమాలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 21 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన బీసీలు, ఈబీసీ ధృవపత్రం కలిగిన కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపుకు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలో స్థిర నివాసం కలిగిన అర్హులు ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కుల ధృవీకరణ పత్రం, రేషన్‌కార్డు, విద్యార్హత సర్టిఫికేట్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర ధృవీకరణ పత్రాలతో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొత్తమారికుప్పం భూములపై విచారణ జరపండి: సీపీఐ


కొత్తమారికుప్పంలో సీపీఐ నాయకులు

సత్యవేడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమారికుప్పంలో ఆక్రమిత భూములపై సమగ్ర విచారుణ జరిపి, ఆక్రమణ చెరలో ఉన్న భూములను విడిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్‌తో కలిసి సోమవారం కొత్తమారికుప్పంలో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కొత్తమారికుప్పం రెవెన్యూ పరిధిలో కొందరు 300 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు.

దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులకు వైద్య పరీక్షలు

సత్యవేడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బోగస్ పింఛన్ల ఏరివేతకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండలంలో దివ్యాంగుల పింఛన్లపై దృష్టి సారించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఎంపీడీవో చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ ఆధ్వర్యంలో సత్యవేడు సీహెచ్‌సీ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ సురేష్, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి ఆర్థో వైద్యుడు డాక్టర్ జయగోపాల్ దివ్యాంగుల పింఛన్ల లబ్దిదారుల సదరం సర్టిఫికేట్లను, అంగవైకల్య శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.